
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 5 మే 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.160	240	270
నల్లగొండ	రూ.162	235	267

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 24.8



పల్లెకు పోదాం సందడి చేద్దాం



- వేసవి సెలవులు.. పల్లెతల్లిపై ప్రేమానురాగాలకు నెలవులు
- కనువిందు చేసేలా పల్లె అందాలు
- యాంత్రిక జీవనం వీడి.. కొత్త ప్రపంచంలో విహారం

కోడి కూతలు.. కోడె లేగలు.. యాప పుల్లలు.. సాంపి చల్లడం.. ముగ్గేయడం పల్లెకు సొంతం. ఉదయాన్నే పొలపొంగు లాంటి పల్లెల్లో జోడెడ్లను తోలుకొని, నాగలి భుజాన పెట్టుకొని రైతన్న పయనమవు తుంటే, ఆ ఎడ్లకున్న గంటల శబ్దం, రాములోరి గుడిలోని గంటల శబ్దం ఒక్కటై మోగు తుంటే పల్లెలోని పరిమలత్వం మైమరిపిస్తుంది. పైరగాలి చల్లదనం, చెరువుల్లో చేప పిల్లల సవ్వడి, మామిడి తోటల సోయగం చూసేందుకు చూడ ముచ్చటగా కన్పిస్తాయి. మావ, బాపుల పలకరింపులు, బావ, మరదళ్ల ఆటలు, జిల్లగోనలు, గోలీలాటలతో చిన్నారుల సందడి ఏడాదికి ఒక్కసారైనా ఊరిని చూసొద్దాం రమ్మంటూ పిలుస్తాయి. ఉరుకుల, పరుగుల జీవనానికి అలవాటుపడిన ప్రజలు.. వేసవి సెలవుల్లో స్వగ్రామాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంటోంది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

7



నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం బొమ్మకల్ వద్ద ఇసుక కోసం పాలేరు వాగులో సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

ఆంధ్రజ్యోతి పరిశీలన

జిల్లాలో ఇసుకమాఫియా చెలరేగిపోతోంది. మాఫియాను కట్టడి చేయాల్సిన అధికారయంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు లొంగడంతో ఇసుక అక్రమదందా మూడుపువ్వులు, ఆరుకాయలుగా కొనసాగుతోంది. పోలీస్‌యంత్రాంగం సైతం ఇసుక మాఫియాకు సహకరిస్తుండడంతో అక్రమరవాణాకు అడ్డుకట్టపడడం లేదని, దీంతో సామాన్యులకు ఇసుక అందుబాటులో లేకపోగా, జలవనరులు ధ్వంసమవుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

ఇసుక మాఫియా ఇష్టారాజ్యం!

- ఇద్దరి కీలకవ్యక్తుల కనుసన్నల్లోనే దందా
- వంగమర్తి ఇసుకే కాళేశ్వరం పేరుతో సరఫరా
- కంచె చేను మేస్తుండడంతో సహకరిస్తోన్న పోలీస్, రెవెన్యూ యంత్రాంగం
- కట్టడి చేయకపోతే ఆదాయం కోల్పోవడమే కాదు, వాగుల రూపమూ కోల్పోయే ప్రమాదం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారం మండలంలోని వంగమర్తి మొదలుకొని జిల్లాలోని మూసీ, పాలేరు నదుల నుంచి దాదాపు 40 ప్రాంతాలనుంచి ఎక్కడపడితే అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మొత్తంగా కీలకమైన ఈ ఇసుక రవాణా మొత్తం ఇద్దరు, ముగ్గురు కీలకవ్యక్తుల కనుసన్నల్లోనే కొనసాగుతుండడం, అధికారులను సైతం వారి కనుసైగలతో శాసిస్తుండడంతో దందాకు అడ్డుకట్టలేకుండా పోయింది.

కాళేశ్వరం, భద్రాచలం లారీల పేరున సరఫరా...

జిల్లాలో కీలకమైన వంగమర్తి రీచ్ నుంచి ఇసుకను రాత్రివేళల్లో, తెల్లవారుజామున అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్నారు. వైటీపీఎస్‌కు సైతం ఈ ఇసుకనే భద్రాచలం, కాళేశ్వరం లారీల పేరుతో సరఫరా చేస్తున్నారని, దీంతో స్థానికంగా తమకు ఉపాధి లేకుండా పోయిందని మిర్యాలగూడ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ నాయకులు నల్లగొండ జిల్లా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేకపోవడానికి రాజకీయ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. ఈ ఇసుకదందా నిర్వహిస్తోన్న కీలకవ్యక్తులే ఇందుకు కారణమని, ప్రధానంగా స్థానిక వాహనాలకు వైటీపీఎస్‌లోకి ఇసుక సరఫరాకు అనుమతిస్తే విషయం బయటకు పొక్కుతుందనే అభిప్రాయంతోనే బ్యాక్‌డోర్ సరఫరాకు తెరలేపారని ఆరోపణలు వస్తున్నాయి. ఆ పరిశ్రమలో నిర్మాణాలకు ఉపయోగించే ఇసుక, వాహనాలను తమ కనుసన్నల్లోనే కొనసాగాలనే పట్టుదలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో స్థానిక లారీలు, ఇసుక రవాణా వాహనాల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంలో వెళితేనే నాణ్యమైన ఇసుక...

జిల్లాలో అధికారికంగా 'మన ఇసుక - మన వాహనం' కింద 23చోట్ల ఇసుక తవ్వకాలకు అనుమతించారు. వంగమర్తి వద్ద 8 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు అవకాశముందని, అనుమతించాలని మైనింగ్‌శాఖకు అనుమతికోసం నివేదించారు. అయితే ఇక్కడ ఇప్పటికే మన ఇసుక- మనవాహనం కింద తవ్వకాలు కొనసాగుతున్నాయి. అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా అవి నామమాత్రంగా మిగలగా, రాత్రివేళ, తెల్లవారుజామున ఎక్స్‌కవేటర్ల ద్వారా తవ్వకాలు జరిపి లారీల్లో ఇసుకను డంప్ చేస్తున్నారని, రాత్రివేళ జరిగేదంతా అక్రమ మార్గాన్నే అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వంగమర్తితోపాటు, అమ్మనబోలు వద్ద సైతం ఇదే పరిస్థితి కొనసాగుతోంది. జిల్లాలో అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఇసుకను బుక్‌చేసుకోవాలంటే సర్వర్ సమస్యలు, తదితర సాంకేతిక కారణాలతో రెండు, మూడు రోజులపాటు ప్రయత్నిస్తే ఒకటో, రెండో ట్రాక్టర్ల ఇసుక బుక్ చేసుకోగలుగుతున్నామని....

- మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

» పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం » సాగర్ పూడికతీతకు చర్యలు » నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మిర్యాలగూడ, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి, జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులు, పౌరసరఫరాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రూ.లక్షా21వేల కోట్లు ఖర్చు చేసి నామమాత్రంగా ఆయకట్టుకు సాగునీరు అందించిందని, తాము అధికారంలోకి వచ్చాక అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.23వేల కోట్లు ఇరిగేషన్‌కు కేటాయించామన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూడికతీత పనులు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు జాతీయస్థాయిలో చర్చించి ఒక్క ఎక్స్‌పోర్టు కమిటీ వేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం డిండి ప్రాజెక్టును చాలాకాలం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.1800కోట్లు కేటాయించి టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టినట్లు తెలిపారు. గంధమల్ల, ఉదయ సముద్రం ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి పనులు చేపట్టినట్లు చెప్పారు. కాళేశ్వరంపై పెట్టిన ఖర్చు అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సరిపోయేదన్నారు. ఈ ఎండాకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ చెరువులన్నింటికీ మరమ్మతులు చేపడుతామన్నారు. ఇరిగేషన్‌శాఖలో లష్కర్‌ల కొరత తీర్చేందుకు ప్రతీ నీటి కింద 50 నుంచి 100 మంది లష్కర్‌లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై నియమించేందుకు కలెక్టర్‌లకు అధికారాలు ఇచ్చామన్నారు. మొత్తం 1800 పోస్టులను 33 జిల్లాలకు కేటాయించామన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్ఆర్, భూసేకరణ త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని ఆదేశించారు.

- మిగతా 6వ పేజీలో...

బ్రాహ్మణవెల్లెంల పూర్తి చేసింది మేమే



మంత్రి వెంకట్‌రెడ్డి

బ్రాహ్మణవెల్లెంల పూర్తి చేసింది మేమే అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ధర్మారెడ్డి, పిలాయిపల్లి, బ్రాహ్మణవెల్లెంలలో కాల్వలను సైతం పూర్తి చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును పూర్తిచేసినట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అత్యధికంగా రూ.1700 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రోడ్లపై రూ.150 కోట్లు ఖర్చుపెట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

వానాకాలంలో నీరందించాలి



శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

ఎండాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాజెక్టుల కింద నిర్వహణ కోసం నిధులు కేటాయించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శివన్నగూడెం కింద కిష్టాపురం వరకు కాల్వలను పొడిగిస్తే ఆ చుట్టుపక్కల ప్రాంతానికి సాగునీరు అందుతుందన్నారు. ఎస్ఎల్‌బీసీ లైనింగ్ పనులకు రూ.442కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, రానున్న రోజుల్లో ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయితే ఉ దయ సముద్రం కింద ఆయకట్టు పెరగనుందని, కాల్వ లైనింగ్‌తోపాటు వెడల్పు చేయాలని సూచించారు. పౌరసరఫరాలలో భాగంగా ఆంధ్రా నుంచి వస్తున్న ధాన్యాన్ని నియంత్రించాలన్నారు. ఖమ్మం నుంచి ధాన్యం ఎక్కువగా వస్తుందని, అక్కడి నుంచి ధాన్యం రాకుండా చూడాలని అధికారులను కోరారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నకిరేకల్, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే భూభారతి రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అధికారులకు సూచించారు. నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం రెవెన్యూ సదస్సులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 భూభారతి చట్టం అమలులో భాగంగా నకిరేకల్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతీ గ్రామంలో దండోరా వేయించాలని, రైతులు రెవెన్యూ సదస్సులో పాల్గొనే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

● ఆర్టీసీ జేఏసీ నేతల డిమాండ్



డిపో గేటు ఎదుట సమ్మె పోస్టర్ ప్రదర్శిస్తూ ధర్నా చేస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

మిర్యాలగూడ టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం జేఏసీ ఆధ్వర్యంలో గేటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు పాండురంగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆర్టీసీని ఆదుకోవాలని, ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికులపై రోజురోజుకూ పనిభారం పెరుగుతోందని, డిపోలలో నియామకాలు చేపట్టడం లేదన్నారు. దీర్ఘకాలికంగా వేతన సవరణ జరగలేదని, సీసీఎస్ నిధులు చెల్లించలేదన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మె నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. అనంతరం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమాలలో రాష్ట్ర సీనియర్ నాయకులు ఏ. నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాము, ఎండీ. బేగ్, బీవై. కోటయ్య, వెంకన్న, రాయన్న, మధు, బాలునాయక్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ కమిటీ ఏర్పాటు

ఆర్టీసీ కార్మిక సంఘం జేఏసీ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఈయూ రాష్ట్ర కార్యదర్శి పాండురంగయ్య తెలిపారు. జేఏసీ చైర్మన్‌గా నరసింహ, వైస్‌చైర్మన్‌గా వెంకన్న, కన్వీనర్‌గా కోటయ్య, కోకన్వీనర్‌గా కేఎస్ రాయన్న, ఎమ్మారెడ్డి, శ్రీనివాస్, బేగ్, చంద్రశేఖర్ తదితరులతో జేఏసీ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

ప్రశాంతంగా నీట్ - 2025 ప్రవేశ పరీక్ష

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ



ఎన్జీ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండటౌన్, మే4 (ఆంధ్రజ్యోతి): వైద్య, దంత వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్దేశించిన నీట్ - 2025(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) నల్లగొండ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని 7 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షకు మొత్తం 2,082 మంది విద్యార్థులకు 2,006 మంది విద్యార్థులు హాజరుకాగా 81 మంది గైర్హాజయ్యారు. మొత్తం 96.1 శాతం హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను తనిఖీ చేశారు. నీట్ పరీక్ష రాసే అభ్యర్థులకు జిల్లా యంత్రాంగం మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద నుంచి పరీక్షా కేంద్రం వరకు వాహన సదుపాయం కల్పించింది. అదేవిధంగా కేంద్రీయ విద్యాయానికి వెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేశారు.

పట్టుదలకు మారుపేరు భగీరథుడు

అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాజ్ కుమార్



భగీరథ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్

నల్లగొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టుదలకు మారుపేరు భగీరథుడని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాజ్ కుమార్ అన్నారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని ఆదివారం కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన భగీరథ జయంతిలో పాల్గొని మాట్లాడారు. భగీరథ మహర్షి దివి నుంచి భువికి గంగను తీసుకొచ్చేందుకు కఠోర తపస్సు చేశారని, పట్టువదలని విక్రమార్కుడిలా గంగను తీసుకువచ్చి మానవాళికి నీటిని అందించాడని చెప్పారు. అందుకే సగర క్షత్రియ వంశీయులను పట్టుదలకు మారుపేరుగా చెప్తారన్నారు.

శ్రీరాముడి ఇక్ష్వాక వంశంలో భాగమైన సగర క్షత్రియులు దేశవ్యాప్తంగా నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారని, ప్రభుత్వం తరఫున వారికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మిషన్ భగీరథ తాగునీటి పథకానికి భగీరథుని పేరు పెట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సమాచార శాఖ సహాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భగీరథ మహర్షి మానవాళికి నీటిని అందించడమే కాకుండా పట్టుదలకు మారుపేరుగా నిలిచిపోయారన్నారు. జిల్లా సగర సంఘం అధ్యక్షుడు నేర్లకంటి రవి కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సహాయ అధికారి గామప్ప ఎస్తేర, జిల్లా సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లెట్ల మారయ్య, జిల్లా మాజీ అధ్యక్షుడు గంట కృష్ణ, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎన్.వసంత, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కర్ణాకర్, సీనియర్ నాయకులు ఎన్.పెద్ద జంగయ్య, కోశాధికారి కొలుగూరి ప్రవీణ్, సీనియర్ నాయకులు ఎన్.సుధాకర్, పెండెం వెంకటేష్, గొల్లూరి యాదయ్య, యాదయ్య, శశిధర్, శ్రవణ్, సురేందర్, ధనలక్ష్మి, భిక్షమయ్య పాల్గొన్నారు.

దర్వేశిపురంలో భక్తుల సందడి



ఆలయం వద్ద భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

కనగల్, మే 4(ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్దనున్న రేణుకాఎల్లమ్మ క్షేత్రం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు నిర్వహించి, బోనం నైవేద్యం సమర్పించారు. ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టి అమ్మవారికి మొక్కుకున్నారు. ఉదయం అర్చకుడు నాగోజు మల్లాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయం వద్ద చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ప్రాజెక్టులకు మంచి రోజులు



- ఏఎమ్మార్పీ లైనింగ్, శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండిపై సీఎం ప్రత్యేక దృష్టి
- నిధులు కేటాయించిన కాంగ్రెస్ ప్రభుత్వం

6

భక్తజన సంద్రం.. యాదగిరిక్షేత్రం



- శాస్త్రోక్తంగా నిత్య పూజలు
- వారాంతంలో నేరుగా వస్తేనే ప్రొటోకాల్ దర్శనాలు

7

లిఫ్ట్ ఇచ్చి.. బంగారు ఉంగరం కాజేసి

మిర్యాలగూడ అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడైన వృద్ధుడికి బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి వేలి ఉంగరాన్ని కాజేశాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శనివారం జరిగింది. బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకా రం.. నిడమనూరు మండలకేంద్రానికి చెందిన వృద్ధుడు రాపోలు నర్సింహ పని నిమిత్తం పట్టణానికి వచ్చి స్వస్థలానికి వెళ్లేందుకు సాగర్‌రోడ్డుపై నడుచుకుం టూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక రైతుబజారు వద్ద బైక్‌పై వస్తున్న గుర్తుతెలియని వ్యక్తి బస్టాండ్ వద్ద దింపుతానంటూ బైక్‌పై ఎక్కించుకున్నాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో నడవలేని స్థితిలో బాధిత దివ్యాంగ వృద్ధుడు బైక్‌పై ఎక్కాడు. అతనిని ఎన్నెస్పీ క్యాంపులోని టీఎన్‌జీవో భవనం పక్కన ఉన్న సందులోకి తీసుకొని వెళ్లి బాధితుడు నర్సింహాను బెదిరించి చేతికున్న సుమారు అర తులం బంగారు ఉంగరాన్ని లాక్కొని పారిపోయాడు. ఈ విషయమై బాధితుడు ఆదివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపారు.

ఇద్దరు కూలీలకు గాయాలు



గాయపడిన కూలీలను అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

ఆలేరు రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): చెక్‌డ్యాం నిర్మాణ పనుల్లో ఉన్న ఇద్దరు కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం బైరాంనగర్‌లో ఆదివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో నిర్వహిస్తున్న చెక్‌డ్యాం నిర్మాణ పనుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాషా అలియాస్ రఫిక్, పి. లక్ష్మీ ఉదయం 8 గంటల సమయంలో పనిచేస్తుండగా సిమెంట్ కంకర కలిపే డ్రైవర్ అజాగ్రత్తగా ఉండడంతో మిషన్ వెనక్కి వచ్చి ఇద్ద కూలీలకు కాళ్లకు తగిలింది. దీంతో గ్రామస్థులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గాయపడిన కూలీలను ప్రాథమిక చికిత్స కోసం ఆలేరులోని కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. కాగా విశ్రాంతి లేకుండా పనులు చేస్తున్న కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటే కూలీల ప్రాణాలకు ముప్పు ఉండేదని పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఐబీ ఏఈ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా అనారోగ్యం కారణంగా తాను సెలవుల్లో ఉన్నానని తెలిపారు.

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత



కంటేనర్‌లో ఉన్న పశువులు

కోదాడ రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీ కంటైనర్‌ను సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ నుంచి లారీ కంటైనర్‌లో 101గోవులను తరలిస్తుండగా, ఆదివారం ఉదయం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పట్టుకున్నారు. గోవులను తాళ్లతో బంధించి, నీరు, ఆహారం లేకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారని పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ సునీల్, వ్యాపారి మహ్మద్ సల్మాన్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గోవులను హైద్రాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొండమల్లేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఆదివారం మధ్యాహ్నం చింతకుంట్ల గ్రామంలోని వ్యవసాయ బావి వద్ద ఆదివారం మధ్యాహ్నం దుస్తులు, చెప్పులు ఉండడాన్ని గమనించారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొండమల్లేపల్లి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టగా గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతునికి సంబంధించి సమాచారం ఉంటే పోలీసులకు అందించాలని ఎస్ఐ రామ్మూర్తి కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ధ్వంసమైన బస్సు

చిట్యాలరూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న డీసీఎంను ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. డీసీఎంను బస్సు ఢీకొట్టి ఆగడంతో వెనుక నుంచి వచ్చిన మరో కారు ఆ బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఆదివారం పిట్టంపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న డీసీఎం వెలిమినేడు శివారులోకి రాగానే వెనుక నుంచి వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం ధ్వంసమైంది. ఎవరికీ గాయాలు కాలేదు. డీసీఎంను ఢీకొట్టిన ప్రైవేటు బస్సును వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బస్సును వెనుక నుంచి ఢీకొని..

ఆలేరు రూరల్: బస్సును టిప్పర్ ఢీ కొట్టిన సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. జనగామ డిపోకు చెందిన టీజీ 05 జెడ్ 0058 నెంబరు గల బస్సు సుమారు 60 మంది ప్రయాణికులతో జనగామ నుంచి జగద్గిరిగుట్టకు బయలుదేరింది. ఆలేరు బస్టాండ్ నుంచి తిరిగి బయలుదేరి వరంగల్-హైదరాబాద్ 163వజాతీయ రహదా రిపైకి ఎక్కుతున్న క్రమంలో జనగామ నుంచి హైదరాబాద్ వెళ్తున్న టిప్పర్ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో బస్సు వెనుక వైపు ఉన్న అద్దం పూర్తిగా ధ్వసమైంది. ప్రయాణికులకు గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

దినపత్రికల ఏజెంట్ యోగానందం మృతి



యోగానందం(ఫైల్)

నకిరేకల్, మే 4, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన పలు దినపత్రికల ఏజెంట్ గంగాధర యోగానందం(53) ఆదివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. పాఠకులకు పత్రికలు వేసేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లగానే ఇంటి ముందు ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోయారు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆయనను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన గుండెపోటుకు గురైమృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. 30 సంవత్సరాలుగా పలు పత్రికలకు ఏజెంట్‌గా పనిచేశారు. యోగానందం నకిరేకల్ పట్టణ ప్రజలకు సుపరిచితుడు, యోగానందం మృతిచెందినట్లు సమాచారం తెలుసుకున్న వివిధ పత్రికల ఏజెంట్లు నకిరేకల్ పట్టణంలో పత్రికలను పంపిణీ చేయలేదు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ప్రాజెక్టులకు మంచి రోజులు



ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు

- ఏఎమ్మార్పీ లైనింగ్, శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండిపై సీఎం ప్రత్యేక దృష్టి
- నిధులు కేటాయించిన ప్రభుత్వం
- ముందుకుసాగనున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

దేవరకొండ, మే 4(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులకు మహర్దశ పట్టనుంది. ఏఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ, శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి రిజర్వాయర్‌లు పూర్తిచేయాలని ప్రభు త్వం నిధులు కేటాయించింది. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు మరమ్మ తులకు ప్రభుత్వం ఇటీవల రూ.442కోట్లు కేటాయించి పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించింది. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. శ్రీశైలం సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి రిజర్వాయర్ పనులపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారు దలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్డు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టులను పూర్తిచేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు.

ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్ మరమ్మతులకు రూ.442 కోట్లు

2001లో ప్రారంభించిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు మరమ్మత్తులకు మోక్షం వచ్చింది. నల్లగొండ జిల్లాలోని రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, 516 గ్రామాలకు తాగునీటితోపాటు హైదరాబాద్ జంటనగరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టును 2001లో ప్రారంభించారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి మరమ్మతులు నిర్వహించలేదు. ప్రాజెక్టు పరిధిలో 22.500 కిలో మీటర్లమేర లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఏఎమ్మార్పీ నుంచి పానగల్ రిజర్వాయర్ వరకు విస్తరించి ఉన్న ఏఎమ్మార్పీ కాల్వలకు మర మ్మతులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొని నిధులు కేటాయించింది. ఏఎమ్మార్పీ పరిధిలోని డిస్ట్రీబ్యూటరీలు, కాల్వలు, కంపచెట్లు పేరుకుపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. నాలుగు మోటర్లతో నీటిని విడుదల చేస్తున్నప్పటికీ నీరు వృథా అవుతుంది. మర మ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధిలోని లీకేజీలను అరికట్టే అవకాశాలున్నాయని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఏఎమ్మార్పీ కాలువ చుట్టూ పెరిగిన కంపచెట్లు (ఫైల్)

నక్కలగండి రిజర్వాయర్‌కు త్వరలో అటవీ శాఖ అనుమతులు

నక్కలగండి రిజర్వాయర్‌ను భూములు కోల్పోతున్న భూనిర్వాసితులందరికి ప్రభుత్వం పరిహారం, పునరావాసం కల్పించింది. నక్కలగండి, మోత్యతండాలో ఇళ్లు, భూములు కోల్పోతున్న నిర్వాసితులకు భూపరిహారం అందజేశారు. పునరావాసం కింద చింతపల్లి మండలం నసర్లపల్లిలో 15 ఎకరాలు కెటాయించి ఇళ్లు, పునరావాసం కల్పించినట్లు అధికారులు తెలుపుతున్నారు. త్వరలో అటవిశాఖ అనుమతి వస్తుందని దీంతో రోడ్ల నిర్మాణ పనులు పూర్తవుతున్నట్లు ఏఎమ్మార్పీ అధికారులు తెలుపుతున్నారు. కాగా ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల ఎత్తుపెంపు పనులు 30శాతం గతంలో పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో పనులు నిలిచిపోయాయి. ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల ఎత్తుపెంపు పనులకు కూడ ప్రభుత్వం నిధులు కెటాయించి మళ్లీ టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేపడుతుంది. ప్రాజెక్టులు పూర్తియితే దేవరకొండ నియోజకవర్గంలో మూడున్నర లక్షల ఎకరాల వరకు సాగునీరు అందుతుంది.


ప్రాజెక్టులు పూర్తిచేసి సాగునీరు అందిస్తాం



శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుంది. ప్రాజెక్టుల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు నిధులు కేటాయిస్తూ ప్రత్యేక దృష్టి సారించారు. ఏఎమ్మార్పీ మరమ్మతులు త్వరలో ప్రారంభంకానున్నాయి. ప్రాజెక్టులు పూర్తియితే దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందుతుంది.

- నేనావత్ బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

టన్నెల్ బేరింగ్ మిషన్ పిట్టింగ్ పనులు ప్రారంభం



అమెరికా నుంచి శ్రీశైలం సొరంగమార్గం టన్నెల్ బేరింగ్ మిషన్ మన్నేవారిపల్లి ఔట్‌లెట్‌కు చేరుకోవడంతో టన్నెల్-1 వద్ద టన్నేల్ బేరింగ్ మిషన్ పిట్టింగ్ పనులు కొనసాగుతున్నాయి. చిన్న, చిన్న పరికరాలు జర్మనీ, కెనడా దేశాల నుంచి రానున్నాయి. రెండు నెలల్లో టన్నెల్ బేరింగ్ మిషన్ ఫిట్టింగ్ పనులు పూర్తిచేసి తవ్వకాలు చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 2007లో రూ.1925కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన శ్రీశైలం సొరంగ మార్గం పనులు 44.6 కిలోమీటర్లు తవ్వాల్సి ఉండగా ప్రస్తుతం 30.4 కిలోమీటర్లమేర తవ్వకాలు నిర్వహించారు. ఇన్‌లెట్, ఔట్‌లెట్ పనులు మరో 9.6కిలోమీటర్ల మేర తవ్వాల్సి ఉంది. శ్రీశైలం దోమలపెంట ఇన్‌లెట్ వద్ద తవ్వకాలు జరుపుతుండగా ఫిబ్రవరి 22న జరిగిన ప్రమాదంలో టన్నెల్ కూలి ఎనిమిది మంది గల్లంతయ్యారు. ఇద్దరి మృతదేహాలు వెలికి తీశారు. ఆరుగురి ఆచూకీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. శ్రీశైలం సొరంగ మార్గం 2007లో అప్పటి సీఎం వైఎస్ శంకుస్థాపన చేశారు. రూ.1925 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించారు. ఏళ్లు గడుస్తుండడంతో ప్రాజెక్టు అంచనా వ్యయం గణనీయంగా పెరిగింది. గత ప్రభుత్వం శ్రీశైలం సొరంగమార్గం పనులు పట్టించుకోక నిధుల కేటాయింపులో జాప్యం చేయడం, టన్నెల్ బేరింగ్‌మిషన్ తరచు మరమ్మతులకు గురవుతుండడంతో ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఎస్ఎల్‌బీసీ, శ్రీశైలం సొరంగమార్గం అంచనా వ్యయం రూ.4637 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. రెండున్నర ఏళ్లలో ప్రాజెక్టును పూర్తిచేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. అమెరికా నుంచి బేరింగ్ మిషన్ మన్నెవారిపల్లి సొరంగమార్గం వద్దకు చేరుకోవడంతో పనులు పునః ప్రారంభమవుతాయని రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

డిండి ఎత్తిపోతల పనులకు రూ.1800 కోట్లు కేటాయింపు

డిండి ఎత్తిపోతల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1800 కోట్లు కేటాయించింది. ఎదుళ్ల నుంచి డిండి అనుసంధాన ప్రాజెక్టు పనులకు పరిపాలన ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎదుళ్ల, ఉల్పర అనుసంధాన పనులకు రూ.1800 కోట్లు కెటాయించడంతో డిండి ఎత్తిపోతల పనులు ఊపందుకున్నాయి. త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా గొట్టిముక్కల, సింగరాజు పల్లి, శివన్నగూడెం, చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి, ఇర్విన్, ఉల్పర రిజర్వాయర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. భూసేకరణ, పునరా వాస ప్రక్రియ దాదాపుగా పూర్తి చేశారు. టెడర్లు పిలిస్తే ఎదుళ్ల నుంచి డిండి ఎత్తిపోతల అనుసంధాన పనులు వేగవంతం కానున్నాయి.

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

● నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ● ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్ట్‌లపై ప్రజాప్రతినిధులతో సమీక్ష



5వ పేజీ తరువాయి

ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి, జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులు, పౌరసరఫరాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.1800కోట్లు కేటాయించి టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు. గంధమల్ల, ఉదయ సముద్రం ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రటరి డీఎస్ చౌహన్, పౌరసరఫరాలశాఖపై జరిగిన సమీక్ష సందర్భంగా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఆర్‌అండ్‌ఆర్ సమాచార పౌరసరఫరాలశాఖ ఇన్‌చార్జి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, గుత్తా అమీత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి రాహుల్‌బొజ్జ, ఇంజనీరింగ్ చీఫ్‌లు శ్రీనివాసరావు, అహ్మద్ ఉస్సేన్, సూర్యాపేట, భువనగిరి కలెక్టర్‌లు తేజస్‌నందలాల్ పవర్, హనుమంతరావు, సబ్‌కలెక్టర్ నారాయణ అమీత్, ఇంజనీరింగ్ అండ్ చీఫ్ అజయ్‌కుమార్, నీటిపారుదల శాఖ, పౌరసరఫరాలశాఖ అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నిర్వాసితుల భూములకు ధరపై ఆలోచించాలి : ఎంపీ చామల



భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గంధమల్ల ప్రాజెక్టు కింద భూసేకరణ పెండింగ్‌లో ఉందని, భూములు కోల్పోయిన రైతులకు ధర విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లాయిపల్లి ధర్మారెడ్డి కాల్వ పనులకు నిధులు కేటాయించి పూర్తిచేయాలన్నారు. శాలిగౌరారం ప్రాజెక్టుకు మరమ్మతులు నిర్వహించాలని మంత్రిని కోరారు.

సాగర్ ఎడమకాల్వ మెయిన్ కెనాల్ మరమ్మతులు చేపట్టాలి: ఎమ్మెల్యే బీఎల్ఆర్



మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నాలుగు లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మెయిన్ కెనాల్‌కు 51.05 కిలోమీటర్ల నుంచి 73.52కిలో మీటర్ల వరకు కాల్వ లైనింగ్ దెబ్బతిని డిజైన్ డిశ్చార్జి కంటే తక్కువ నీరు విడుదల చేయడంతో చివరి భూములకు నీరు అందడం లేదన్నారు. మంత్రి ఉత్తమ్ స్పందించి తక్షణమే మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ సీఈవోను ఆదేశించారు.

కిష్టాపురం వరకు బ్రాహ్మణవెల్లెంల కాల్వను పొడిగించాలి: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మణ వెల్లెంల ప్రాజెక్టు కింద కిష్టాపురం వరకు కాల్వను పొడిగించాలన్నారు. మునుగోడు నియోజక వర్గంలో 148గొలుసుకట్టు చెరువులు నిర్వాహణ లేకపోవడం వల్ల నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. వీటి మరమ్మతులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని మునుగోడు నియోజకవర్గం ఫ్లోరైడ్ ప్రాంతం కావడంతో ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రులను కోరారు.

పెండ్లిపాకల రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేయాలి : ఎమ్మెల్యే బాలు



దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలోని కిష్టరాయన్‌పల్లి కింద భూసేకరణ కొనసాగుతుందని నక్కలగండి రిజర్వాయర్ షటర్‌లను పూర్తి చేయాలన్నారు. పెండ్లిపాకల రిజర్వాయర్ నిధులు ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్నాయని మంజూరు చేయాలని కోరారు. పొగిళ్ల, అంభభవాని, ఏకేబీఆర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని ఆయన కోరారు.

పిలాయిపల్లి కాల్వకు నిధులు కేటాయించాలి : ఎమ్మెల్యే కుంభం



భువనగిరి ఎమ్మెల్యే కంభంపాటి అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల తన నియోజకవర్గంలో ఎక్కడ తాలు, తరుగు పేరుతో ధాన్యాన్ని తీయడంలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లోనే రైతులకు నగదు అందజేస్తున్నామని తెలిపారు. పిలాయిపల్లి కాలువకు రూ.500 కోట్లు కేటాయించాలని, పనులను పూర్తిచేయాలని కోరారు.

నెల్లికల్ లిఫ్ట్ పనులకు నిధులు మంజూరు చేయాలి : ఎమ్మెల్యే జైవీర్



నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లికల్ లిఫ్టు పూర్తయ్యేందుకు మరో 15.9 కోట్ల రూపాయలు విడుదల చేయాలని కోరారు. విద్యుత్ బకాయిలే రూ.10కోట్ల వరకు ఉన్నట్లు చెప్పారు. నిడమనూరు చెరువుకు కాలువద్వారా నీటిని నింపి సాగు అవసరాలకు వినియోగించుకునేలా కట్టల మరమ్మతులు, షట్టర్లు కాల్వ వద్ద తూములను మరమ్మతులు చేయాలన్నారు. జంగల్ క్లియరెన్స్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కోటి 20లక్షల రూపాయలను విడుదల చేయాలని కోరారు.

శివన్నగూడెం లిఫ్ట్ నిర్మాణం చేయాలి : ఎమ్మెల్సీ సత్యం



శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతం దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. డిండి ప్రాజెక్టును పూర్తి చేసి ఫ్లోరైడ్ పీడిత ప్రాంతం మునుగోడుకు ప్రజల తాగు సాగు నీటి కష్టాలను తీర్చాలని అన్నారు. శివన్నగూడెం రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ఏర్పాటుతో నారాయణపూర్, చౌటుప్పల్ మండలాలకు నీరందించవచ్చునని ఆయన అన్నారు. తాలు తరుగు పేరుతో క్వింటాకు రెండుమూడు కిలోల చొప్పున తరుగు తీస్తున్నారని, కాంటాలు అయిన ధాన్యానికి మిల్లుల్లో తరుగు తీస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.

దున్నపోతుల గండి లిఫ్ట్ భూసేకరణను పూర్తి చేయాలి : ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గం అడవిదేవులపల్లి మండలంలో ఏర్పాటు చేస్తున్న దున్నపోతుల గండి లిఫ్ట్ కాలవలకు భూసేకరణ పూర్తి చేయాలని అన్నారు.

రహదారి బిజీ బిజీ



యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో రహదారిపై వాహనాల రద్దీ నెలకొనగా, ఇటు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు కిటకిటలాడారు. బస్‌స్టేషన్‌తో పాటు జాతీయ రహదారిపై ఎండలో వాహనాల కోసం ప్రయాణికులు ఎదురుచూడడం కన్పించింది. హైవే పై ఉన్న జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ఎండను సైతం లెక్క చేయకుండా వాహనాలను నియంత్రించారు.

ఆంధ్రజ్యోతి- చౌటుప్పల్ టౌన్

పలువురు సీఐల బదిలీ

భువనగిరి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాలో పలువురు సీఐలు బదిలీ అయ్యారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి టౌన్ సీఐ కె సురేష్ కుమార్ రాచకొండ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో యాదగిరిగుట్ట సీఐ ఎం. రమేష్‌కుమార్ బదిలీపై వచ్చారు. యాదగిరిగుట్టకు రాచకొండ సీఐ సెల్ ఇన్‌స్పెక్టర్ బి. భాస్కర్ వచ్చారు. యాదగిరిగుట్ట రూరల్ సీఐ ఎం. కొండల్‌రావు ఆలేరుకు బదిలీ కాగా ఆయన స్థానంలో పోలీస్ కమిషనరేట్‌లో వెయిటింగ్‌లో ఉన్న సీ. శంకర్‌గౌడ్ బదిలీపై వచ్చారు. చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కె మురళీమోహన్ సీసీఆర్‌బీ నుంచి బదిలీపై వచ్చారు. అదేవిధంగా ఇటీవల బదిలీ అయిన భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వి. సంతోష్‌కుమార్‌కు హయాత్‌నగర్ పోలీస్ స్టేషన్ డీఐగా పోస్ట్ లభించింది.

పల్లెకు పోదాం..

సందడి చేద్దాం

వేసవి సెలవులు వచ్చాయంటే చాలు పట్టణ ప్రజలు పల్లెలకు పయనమవుతుంటారు. ప్రస్తుత కాలంలో ఉద్యోగం, వ్యాపారం, విద్య, జీవనోపాధి రీత్యా పల్లె ప్రజలు పట్టణాలపై ఆధార పడుతున్నారు. విద్యాభ్యాసం చేస్తున్న వారికి వార్షిక పరీక్షలు ముగిసిపోవడంతో పాఠశాలలు, కళాశాలలతోపాటు పలు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. దీంతో పట్టణాల్లో నివసిస్తున్న పల్లెవాసులంతా తమ స్వగ్రామాలకు పిల్లాపాపలతో తరలివెళ్తున్నారు. తామంతా చిన్నప్పుడు అనుభవించిన ప్రకృతి సౌందర్యం, ఆటాపాటలు, ఈత వంటివి చిన్నారులు కూడా అనుభూతి పొందాలని, నానమ్మ, అమ్మమ్మ, తాతల అనురాగాన్ని చిన్నారులు పొందాలని తల్లిదండ్రులు తపన పడుతారు. పట్టణాల్లో యాంత్రిక జీవనానికి అలవాటు పడిన పసి మనసులు కొత్త ప్రపంచంలో విహరించేందుకు వేసవి సెలవులు ఎంతో తోడ్పాటునిస్తాయి. భావిపౌరులు పల్లెతల్లి ప్రేమానురాగాలను చూసేందుకు వేసవి సెలవులు నెలవు కానున్నాయి. ఇన్నాళ్లుగా పుస్తకాలతో కుస్తీ పట్టిన చేతులు మట్టివాసన పరిమళాలు అందిపుచ్చుకోనున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాలో మొత్తం 17మండలాలు, 428 గ్రామపంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. జిల్లాలో 2.69లక్షల కుటుంబాలు... అన్ని వయస్సుల వారు దాదాపుగా 7లక్షలకు పైగా ఉంటారు. అయితే ఈ జిల్లాలోని ప్రజలు జీవనోపాధికోసం హైదరాబాద్ నగరంలోనే గడుపుతారు. ఉన్నత విద్యకోసం కూడా నగరంపైనే ఆధారపడతారు. అయితే సెలవులు రాగానే పల్లెల్లోకి ప్రకృతి సోయగాలను అస్వాదిస్తారు.





ఆప్యాయత, అనురాగం

పట్టణాల్లో అంకుల్, ఆంటీ అంటూ నిత్యం పలకరింపులుంటాయి. పల్లెటూరు అంటేనే ఆప్యాయత, అనురాగం తొణికిసలాడుతుంది. కులాలు, మతాలకతీతంగా పల్లెల్లో వరసలతోనే పిలుచుకుంటారు. పట్టణాల కంటే భిన్నమైన అనుబంధాలు పెనవేసుకుని ఉంటాయి. పెద్దలు ఇచ్చుపుచ్చుకునే మర్యాదలు, కట్టుబాట్లు ఎవరిని ఎలా పరిచయం చేసుకోవాలి..., ఎలా గౌరవించాలన్న విషయాలు బోధపడతాయి. నానమ్మ, అమ్మమ్మ, తాతయ్య, బాబాయ్, పిన్ని, మావ, అత్త వినోదాన్ని నింపేలా, కుటుంబ బంధాలు, అనుబంధాలు బలపడేలా ఉంటాయి. రాత్రివేళల్లో పెద్దలు చెప్పే నీతికథలు చిన్నారుల్లో నైతిక విలువలు పెంపొందుతాయి. పల్లెల్లో పెద్దవారు కనిపించినప్పుడు లేచి నిలుచునే గౌరవం ఉంటుంది. చాలా కుటుంబాల్లో పాదాభివందనం చేసే సంస్కృతి ఉంటుంది. వీటిని చిన్నారులు గమనించి పాటిస్తే సమాజంపై వారికి గౌరవభావం పెంపొందుతుంది.

కనువిందు చేసేలా పల్లె సీమ అందాలు



పల్లెలు ప్రకృతి సోయగానికి ప్రతిరూపాలుగా ఉంటాయి. పట్టణాల్లో పక్కనున్న ఇంటివారు కూడా పలకరించే పరిస్థితి ఉండదు. ఎవరి పని వారు చేసుకుంటూ రోజంతా హడావుడిగా కాలం గడుపుతారు. ఉద్యోగస్తులైతే ఆదివారం, సెలవు దినాల్లో ఇంటికే పరిమితం అవుతారు. అయితే పట్టణాల్లో గజిబిజి భవనాలు ఉండటంతో వారికి ఉదయం, సాయంత్రం అనేది కేవలం గడియారం చూసుకుంటేనే అర్థమవుతుంది. పల్లెల్లో సూర్యోదయం, సూర్యాస్తమయం, పచ్చని పైర్లు, పొంగిపొర్లే వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, పక్షుల కిలకిలారాగాలు, పశువుల అరుపులు, పండ్ల తోటలు, తాటి ముంజలు, ఈతపండ్లు, ఇలా ప్రతీ దృశ్యం పల్లె అందాలను కనువిందు చేసేలా ఉంటుంది. చిన్నారులు ప్రకృతి అందాలను ఆస్వాదించి జ్ఞాపకాలను మదిలో నిలుపుకునే అవకాశం ఉంది.

సమష్టితత్వం గ్రామీణ జీవనం



సమష్టి జీవనం... శ్రమైక సౌందర్యం పల్లెల్లో విరా జిల్లుతుంది. సమష్టితత్వం గ్రామీణ జీవనశైలిని ప్రతిబింబిస్తుంది. పట్టణాల్లోని ప్రజలు నిరంతరం హడావుడి జీవితం గడుపుతారు. పల్లె జీవన విధానం పట్టణ జీవనానికి భిన్నంగా ఉంటుంది. గ్రామీణ వాతావరణంలో వ్యవసాయం, చేతివృత్తులు, విభిన్న ఆచారాలు, సంప్రదాయాలకు నెలవై ఉంటాయి. గ్రామాల్లో పండగలు, ఉత్సవాలు కులాలు, మతాలకతీతంగా అందరూ కలిసికట్టుగా జరుపుకుంటారు. సాటివారికి కష్టం వచ్చినప్పుడు సాయం చేసుకుంటూ మనోధైర్యం నింపుతారు. చిన్నారులు పల్లెల్లో విహరిస్తే., జీవన విధానంపై అవగాహన పెరుగుతుంది. తద్వారా నిస్వార్థ జీవన విధానం, ఆత్మవిశ్వాసం అలవడతాయి.





వ్యవసాయంపై అవగాహన

పట్టణంలో నివసిస్తున్న చిన్నారులకు ఏ చెట్టు ద్వారా ఎలాంటి పండ్లు వస్తాయో, పంటలు ఉత్పత్తి అవుతాయన్నది పుస్తకాల్లో, టీవీల్లో చూసి నేర్చుకోవాల్సిందే. బియ్యం కూడా మిషన్ ద్వారానే ఉత్పత్తి అవుతాయ న్న ఆలోచన చిన్నారుల్లో లేకపోలేదు. వేసవిలో చిన్నారులు పల్లెలను తట్టడంతో తినే అన్నం నుంచి మొదలు..., ప్రతీ పంటల సాగుపై చిన్నారులకు పల్లె సందర్శన ద్వారా అవగాహన పెరుగుతుంది. చిన్నారులకు వ్య వసాయంపై అవగాహన పెంచేందుకు పల్లెసీమలే వేదికలుగా మారతాయి. గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను సందర్శింపచేస్తే వరి, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు, సేంద్రీయ సాగు విధానాలు, ప్రయోజనాలు, ప్రస్తుతం వ్యవసాయం చోటు చేసుకుంటున్న ఆధునిక పరిజ్ఞానం, సాంకేతికత పరిజ్ఞానం, యాంత్రీకరణ, పశువుల ద్వారా సాగు వంటివి చిన్నారులు తెలుసుకుంటారు.

(ఆంధ్రజ్యోతి -యాదాద్రి)



సెలవుల్లో సరదాగా..

పుస్తకాలతో కుస్తీకి వేసవి సెలవుల్లో స్వస్తి



పరీక్షలు పూరై వేసవి సెలవులు వచ్చాయంటే చాలు చిన్నారులు అమ్మమ్మ, తాతయ్య ఇంటికి ఎపుడు వెళ్దామా అని ఎదురు చూస్తారు. పాఠశాలలు ఉన్న రోజులు పుస్తకాలతో కుస్తీ పడైన వారు గ్రామాలకు వెళ్లి సెలవులను సరదాగా గడుపుతారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన బండారు శేఖర్ వాణి దంపతులు కిరాణా వ్యాపారస్తులు. వారి పిల్లలు కూతురు ప్రణీత 7వ తరగతి, సాత్విక్ 4వ తరగతి పూర్తిచేశారు. వీరు వేసవి సెలవుల్లో హైదరాబాద్‌లో ఉండే అమ్మమ్మ తాతయ్య మావయ్య అత్తమ్మల ఇంటికి వెళ్తారు. వేసవి సెలవుల్లో అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లి సెలవులు ముగిసి తిరిగి మా ఇంటికి వచ్చేటపుడు ఇంకొన్ని రోజులు సెలవులు ఉంటే బాగుంని పేంచేదంటున్నారు ఈ అక్కాతమ్ముళ్లు.

- (ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి)

మొబైల్ చూడనివ్వరు



నేను మా తమ్ముడు కలిసి హైదరాబాద్‌లో ఉండే అమ్మమ్మ మామయ్య ఇంటికి వెళ్తాం. 2వ తరగతి చదువుకున్న నాటి నుంచి నేటి వరకు కూడా వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి మావయ్య, పెద్దమ్మల ఇంటికి వెళ్తున్నాం. వాళ్ల ఇంటికి వెళ్లి కూడా ఎంతో క్రమశిక్షణతో ఉంటాం. ఇంటి వద్ద మొబైల్ చూసినా అమ్మమ్మ ఇంటి వద్ద మాత్రం మొబైల్ చూడనివ్వరు. టీవీ కూడా ఎక్కువగా చూడనివ్వకుండా ఆహ్లాదం కోసం పార్కుల వెంట తిప్పేవారు. మామయ్య ఈత కొలనులో ఈత నేర్పించడానికి తీసుకెళ్లేవాడు. చూస్తుండగానే సెలవులు అయిపోయి తిరిగి ఇంటికి వచ్చేందుకు ఏడ్చేవాళ్లం. ఇంకొన్ని రోజులు సెలవులు ఉంటే బాగుండనిపించేది.

- బండారు ప్రణీత

అమ్మమ్మ వినాయకుని కథ చెప్పేది



వేసవి సెలవుల్లో అమ్మమ్మ మామయ్య వాళ్ల ఇంటికి వెళ్లినపుడు అక్కా, నేను ఎంతో సరదాగా గడిపేవాళ్లం. అమ్మమ్మ మాకు వినాయక చవితి పండుగ గురించి చెప్పేది. మధ్యాహ్నం కాలక్షేపం కోసం మా మామయ్య పిల్లలతో కలిసి లూడో ఆడేవాళ్లం. సాయంత్రం ఇంటి ముందు షటిల్ ఆడుకున్నాం. పెద్దవాళ్లతో ఎలా మాట్లాడాలో ఎలా ఉండాలో మా అమ్మమ్మ చెప్పేది. దగ్గర్లో ఉండే ఈతకొలనులో స్విమ్మింగ్ చేసేవాళ్లం.

- బండారు సాత్విక్


బంధుత్వం విలువ తెలియాలని పంపేవాళ్లం



బంధువులంటే ఎవరు.. బంధుత్వం అంటే ఏమిటో మా పిల్లలకు తెలియాలనే వాళ్లను వేసవి సెలవుల్లో వాళ్ల అమ్మమ్మ మామయ్య లేదా పెద్దమ్మ ఇంటికి పంపిస్తున్నాను. నేను కూడా నా చిన్నతనంలో మా అమ్మమ్మ ఇంటికి వెళ్లాను. అలా వెళ్లడం ద్వారా పాఠశాల చదువుల ఒత్తిడి నుంచి కొంత ఉపశమనం కలగడంతో పాటు కొంత స్వేచ్ఛగా ఉండడంతో పాటు కొత్త ప్రాంతంలో అక్కడి వ్యక్తుల జీవన విధానం, సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం లభిస్తుంది.

- బండారు చంద్రశేఖర్

యాదగిరిక్షేత్రం భక్తజన సంద్రం



గర్భాలయ క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

యాదగిరిగుట్ట, మే 4 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అన్ని తరగతుల విద్యార్థులు ఫలితాలు వెలువడటం.. వేసవి సెలవులు...వారాంతపు సెలవు కలిసి రావడంతో ఆదివారం భక్తులతో యాదగిరిక్షేత్రం భక్తజన సంద్రమయ్యింది. రాష్ట్ర నలుమూలల నుంచి ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో నిండిపోగా వైకుంఠద్వారం ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేశారు. కొండపైకి వెళ్లే టోల్‌గేట్ (కొండ కింద) వద్ద వాహనాలు బారులుతీరాయి. ప్రధానాలయం, శివాలయం కల్యాణోత్సవ మండపం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల వద్ద కూడా రద్దీ నెలకొంది. ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలకు పోటీ పడ్డారు. భక్తులను కొండపైకి, కిందకు తరలించేందుకు అధికారులు తగినన్ని ఏర్పాటు చేయగా కొండపైన, కింద ఆర్టీసీ బస్టాండులు కిటకిటలాడాయి. సుమారు 46 వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ఉచిత ధర్మదర్శన క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు ఒక గంట, ధర్మదర్శనాలకు మూడు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఎండ వేడిమి అధికమై క్యూకాంప్లెక్స్, క్యూలైన్‌లోని భక్తులు తాగునీరు, ఉక్కపోతతో ఇబ్బందులు పడగా తిరువీధుల్లో కాళ్లు కాలుతుండటంతో నీడ కోసం పరుగులు పెట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 50,52,970 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, ఉదయం ఆలయ పరిసరాలు పరిశీలించిన ఈవో శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాద తయారీ కేంద్రాన్ని సందర్శించి, ప్రసాదం వినియోగించే ముడిసరుకుల పరిణామం, తయారీ విధానం, ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారు, తాగునీటి వసతి, భక్తుల ఇబ్బందులుపై ఆరా తీశారు.

నిత్యాదాయం రూ.50.52 లక్షలు



నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారలను మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామిఅమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధినిసమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

నేరుగా వస్తేనే ప్రొటోకాల్ దర్శనాలు

శని, ఆదివారాల్లో నేరుగా సంప్రదించిన ప్రముఖులకే ప్రొటోకాల్ దర్శనాలకు అవకాశం ఉంటుందని ఈవో తెలిపారు. రద్దీ రోజుల్లో సాధారణ భక్తుల ఇబ్బందులు తొలిగించేందుకు దర్శనాలు సులభతరం చేసేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మార్పునకు ప్రముఖులు సహకరించి ఆలయ ప్రాశస్త్యాన్ని మరింత పెంచేందుకు తోడ్పాడుటును అందించాలని కోరారు.

ఇసుక మాఫియా ఇష్టారాజ్యం !

(5వ పేజీ తరువాయి)

అదికూడా నాణ్యత లేని ఇసుక వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. అదే బ్లాక్‌లో అయితే నాణ్యమైన ఇసుక ఇస్తున్నారని, ట్రాక్టర్‌కు రూ.5వేలు, టిప్పర్ అయితే (30టన్నులవరకు) రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారని, గత్యంతరం లేని పరిస్థితిలో ఇచ్చి కొంటున్నామని వినియోగదారులు చెబుతున్నారు.



వంగమర్తి వద్ద ఇసుక డంపు

కీలకనాయకులు, పోలీసుల కనుసన్నల్లోనే..

నల్లగొండ జిల్లాలో పోలీసులు, కీలకనాయకులు, వారి అనుచరులు, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే ఇసుకమాఫియా ఇష్టారీతిన తవ్వకాలు చేపడుతోంది. ప్రధానంగా శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి, మాడ్గులపల్లి, వేములపల్లి మండలాల్లో ఈ చీకటిదందా జోరుగా సాగుతోంది. మూసీ, పాలేరు నదుల పరివాహక గ్రామాల్లో అనుమతులు లేకున్నా ఇష్టారీతిన ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరుపుతూ వాగులను లూటీ చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో దాదాపు 1000కి పైగా వాహనాలు రాత్రివేళ రోడ్లమీద ఇసుకతో పరుగులు తీస్తున్నాయని, ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోడ్ లాంగ్వేజ్‌తో..

పోలీసులకు, ఇసుకరవాణాదారులకు మధ్య కోడ్ ఉంటుందని, దాని ప్రకారం ఈ సిండికేట్‌లో ఉన్న ట్రాక్టర్లను మార్గమధ్యంలో పోలీసులు పట్టుకోకుండా రోజుకో రకమైన కోడ్‌ని కొనసాగిస్తున్నారు. విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఎక్కడైనా వాహనాలు ఆపితే, ఈ కోడ్‌ని వారికి తెలియజేస్తే ఈ ట్రాక్టర్లను వదిలేస్తారు. ట్రాక్టర్లను ఎలాంటి ఆటంకాల్లేకుండా ఇసుకరవాణాకు అనుమతిస్తున్నందున ఒక్కో ట్రాక్టర్ యజమాని నుంచి నెలకు రూ.10వేల వరకు వసూలు చేస్తోన్న ఇసుక వ్యాపారులు వాటిలో పోలీసులకు, ఇతర శాఖల అధికారులకు వాటాలు అందజేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. లారీల విషయానికి వస్తే కీలకవ్యక్తులకు చెందిన పెద్దసంఖ్యలో లారీలకు, వారి అనుమతి ఉన్న లారీలకే ఇసుక రవాణాకు అనుమతిస్తున్నారని, ఇతర లారీలకు ఇసుకను ఇవ్వడం లేదని లారీల యజమానులు చెబుతున్నారు. పోలీసులు, ఉన్నతాధికారులు ఈ దందాను నియంత్రించకపోగా, వారికి సహకరించేలా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ అక్రమదందాతో ఒకవైపు ప్రభుత్వ ఆదాయం కోల్పోవాల్సి వస్తోందని, మరోవైపున వాగులు జీవం కోల్పోయి, భూగర్భజలాలు సైతం ఎండిపోయే ప్రమాదం ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్‌శాఖకు గానీ, అటు రెవెన్యూశాఖకు గానీ, గ్రామపంచాయతీకి గానీ ఎలాంటి ఆదాయం రాకపోగా, అడ్డగోలు తవ్వకాలతో వాగులో నీటిచెమ్మలేని దుస్థితికి తెచ్చారని, దీంతో పరిసరాల్లోని బోరుబావులు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

వరి కొయ్యలకు నిప్పుతో ముప్పు



కాసరబాదలో వరికాలుకు పెట్టిన నిప్పు

'సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ముకుందాపురం గ్రామంలో సబ్‌స్టేషన్ సమీపంలోని రైతులు వరి కొయ్యలకు నిప్పుపెట్టారు. దీంతో మంటలు వ్యా పించి సబ్‌స్టేషన్ వరకు చేరాయి. అప్రమత్తమైన విద్యుత్ అధికారులు, రైతులు మంటలార్పడంతో పెను ప్రమాదం తప్పింది.'

'సూర్యాపేట మండలంలోని కాసరబాద గ్రామంలో రైతులు రెండ్రోజుల క్రితం వరికొయ్యలకు నిప్పు అంటించారు. వరికొయ్యకాలు మంటలు అంటుకుని వ్యాపించాయి. సమీపంలోని చెత్త డంపింగ్ యార్డుకు తగులుకుంది. దీంట్లో మంటలు ఎగసిపడ్డాయి.

(ఆంధ్రజ్యోతి-భానుపురి)

» అవగాహన లోపంతో కాలుస్తున్న రైతులు

» దెబ్బతింటున్న భూసారం

వరి కొయ్యలకు నిప్పు పెట్టొద్దని అధికారులు రైతులకు సూచనలను, సలహాలు అందించడం లేదు. దీంతో అవగాహన లేని రైతులు కొయ్యకాలు పెద్దగా ఉన్నాయని, దున్నడానికి ఇబ్బంది అవుతోందని నిప్పుపెడుతున్నారు. వ్యవసాయ పొలాల్లో వరి కొయ్యకాలు కాల్చడం వల్ల పర్యావరణానికి, భూమికి నష్టం కలుగుతోంది. వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. భూసారం తగ్గుతోంది. విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. హార్వేస్టర్ మిషన్‌తో వరి పంటను కోసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు గడ్డిని తీసుకువెళ్తారు. దీంతో దున్నె సమయం లో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలను తగలబెడతారు. గతంలో వరి పంటలను కొడవళ్లతో మొదళ్ల దాక కోసేవారు. రైతులకు పశువులు ఎక్కువగా ఉండడంతో గడ్డిని కుప్పలుకుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వ చేసేవారు.అయితే ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు వచ్చాయి. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. హార్వేస్టర్ మిషన్‌తో వరి పంటను కోసే సమయంలో పైకి కొయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి.

వరికొయ్యలు కాల్చవద్దని చెబుతున్నాం

వరికొయ్యకాలుకు నిప్పు పెట్టవద్దని చెబుతున్నాం.భూసారం దెబ్బతింటుందోని మండల వ్యవసాయాధికారులు, ఏఈవోలు రైతులకు అవగాహనలు కల్పిస్తున్నారు. అక్కడక్కడ మంటలు పెడుతున్నట్లు మా దృష్టికిరాలేదు.

-శ్రీధర్‌రెడ్డి, డీఏవో , సూర్యాపేట

కాల్చడంతో భూసారం కోల్పోతోంది

వరికొయ్యలను కాలిస్తే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాల్చడం వల్ల విపరీతమైన వేడితో భూసారాన్ని కోల్పోతుంది. నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతోంది. పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, రైతు మిత్ర పురుగులు నశిస్తాయి. దీంతో పంట దిగుబడి సరిగా రాదు. పొలాల్లో తిరిగే పాములు, ఉడుములు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉంటోంది. పొలాల గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కాలిపోవడం పర్యావరణానికి హానికలిగిస్తోంది.

పొలాన్ని కలియ దున్నితే లాభాలు

కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం వరకు అధికంగా వచ్చే అవకాశముంది. దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతోంది. సూపర్ ఫాస్పేట్ చల్లితే భూ మిని చౌడు బారడం నుంచి తప్పించడమే కాక భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచుతోంది. కలియ దున్నడం వల్ల ఎకరానికి దాదాపుగా టన్ను వరకు ఎరువు తయారు అవుతోంది.

నవవధువు బలవన్మరణం

● ఐదురోజుల క్రితమే వివాహం



హసీనా(ఫైల్)

హుజూర్‌నగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను వదిలి అత్తగారింటికి వెళ్లలేక ఓ నవ వధువు ఆత్మహత్యకు పాల్పడింది. వివాహమైన ఐదు రోజులకే బలవన్మరణానికి పాల్పడటంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ పట్టణంలోని మట్టపల్లి రోడ్డు కొత్వాల్ గడ్డలో నివాసం ఉంటున్న షేక్ ఖాసింబీ, సైదాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సైదా ఆటో నడుపుతుండగా, భార్య ఖాసింబీ కూలి పనులు చేస్తుంది. కుమార్తె హసీనా(19) ఇంటర్మీడియెట్ పూర్తిచేయగా ఈ ఏడాది ఏప్రిల్ 30న చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన షేక్ యూసుఫ్‌తో వివాహం చేశారు. మే 3వ తేదీన భర్తతో కలిసి హసీనా పుట్టింటికి వచ్చింది. ఆదివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో స్నానం చేసేందుకు వెళ్లింది. ఎంతసేపటికి హసీనా బయటకు రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లి దండ్రులు తలుపు కొట్టి చూడగా ఇనుపకడ్డీకి ఉరేసుకొని కనిపించింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులను విడిచి అత్తగారింటికి వెళ్లటం ఇష్టం లేదని కుమార్తె తమ వద్ద ఆవేదన వ్యక్తంచేసిందని తల్లి ఖాసింబీ కన్నీటి పర్యంతమయ్యారు. హసీనా తల్లి ఖాసింబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోడల్ స్కూల్‌లో 5 నుంచి ఇంటర్ ప్రవేశాలు

శాలిగౌరారం, మే 4(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 26న వెబ్‌సైట్‌లో ఉంచుతామని 27 నుంచి 31వ తేదీ వరకు ఒరిజనల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని, జూన్ 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

నేడు నకిరేకల్ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు

నకిరేకల్, మే 4(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. ఉదయం 7 నుంచి 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించనున్నట్లు ఎన్నికల అధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. 774 గీతకార్మికులు ఉన్న సంఘానికి 9 డైరెక్టర్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఒక ఎస్సీ డైరెక్టర్ ఏకగ్రీవం కావడంతో 8 డైరెక్టర్లకు ఎన్నికలు జరగనున్నాయి. రెండు ప్యానల్స్‌తో 16 మంది డైరెక్టర్లకు పోటీలో ఉన్నారు.


నకిరేకల్‌లో ఎమ్మెల్యే వీరేశం గృహప్రవేశానికి హాజరైన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

ఎమ్మెల్యే వీరేశం గృహప్రవేశానికి హాజరైన మంత్రులు

నకిరేకల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వేముల వీరేశం నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి మంత్రులు ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం హాజరయ్యారు. మంత్రులు ఇద్దరు కోదాడ నుంచి హెలికాఫ్టర్‌లో వచ్చారు. నకిరేకల్‌లోని వాసవీ కళాశాలలో హెలికాఫ్టర్ ల్యాండ్ కాగా అక్కడి నుంచి వీరేశం ఇంటికి కారులో వెళ్లారు. వీరేశం పుష్ప దంపతులతో పాటు కుటుంబసభ్యులు మంత్రులకు స్వాగతం పలికారు. నూతన గృహప్రవేశంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, బాలూనాయక్, కుంభం అనిల్‌రెడ్డి, మందుల సామేల్, కుందూరు జైవీర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు వీరేశానికి శుభాకాంక్షలు తెలిపారు.

కేతేపల్లి: ఎమ్మెల్యే వీరేశం నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి కేతేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నూతన ఇంట్లో ఎమ్మెల్యే వీరేశం, పుష్ప దంపతులను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల, మార్కెట్ డైరెక్టర్లు ఎస్‌కె.లతీఫ్, బయ్య ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, నాయకులు బొజ్జ సుందర్, జి.మాధవరెడ్డి, బడుగుల నరేందర్‌యాదవ్ ఉన్నారు.

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి


దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న గోలి ప్రభాకర్

నకిరేకల్, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఎన్నికల్లో దివ్యాంగులకు 5శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ డిమాండ్ చేశారు. నకిరేకల్ జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా దివ్యాంగులు 8శాతం ఉన్నారని, వారిని ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని అన్నారు. సమస్య పరిష్కరించడంలో వెనుకంజ వేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఎన్జీవో సభ్యులు కృష్ణమాచారి, నరేందర్, వికలాంగుల సంఘం నాయకులు వంటిపాక వెంకన్న, పుట్ట నాగమణి, గందమల్ల మాధవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న లొండగి శ్రవణ్‌కుమార్

చిట్యాల, మే4 (ఆంధ్రజ్యోతి); ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. చిట్యాలలో జరిగిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం విక్రయించిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న మండలంలోని గుండ్రాంపల్లిలో నిర్వహించే సీపీఐ మండల మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండీ అక్బర్, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు, జిల్లా సత్యం, దేశగోని బాలరాజు, ఎండీ జహంగీర్, బొల్లూరి లింగయ్య, గుండాల సత్తయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడు బిక్షమయ్య మృతి

కనగల్, మే 4(ఆంధ్రజ్యోతి): కనగల్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు బుర్రి బిక్షమయ్య(55) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మాదిగ సంఘాల జేఏసీ నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు బిక్షమయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల జేఏసీ నాయకులు పెరిక కరణ్ జయరాజ్, కత్తుల జగన్‌కుమార్, పెరిక అంజయ్య, పందుల రాజు, దాసరి విజయ్, బీరెల్లి నాగరాజు, పెరిక శ్రీను, చింత శివరామక్రిష్ణ, అశోక్ ఉన్నారు.

బహుజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలు

కేతేపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): బహుజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రం కేతేపల్లిలో కార్మిక దినోత్సవం మేడేను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గద్దపాటి సురేందర్ కార్మిక జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సైదులు, మధుభాషిణి, వి.సైదులు, లక్ష్మయ్య, వి.రాములు, శౌరి, ఆరోగ్యయ్య, విజయకుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చిట్యాలరూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన బొంత యాదమ్మ ఇటీవల మృతిచెందగా ఆదివారం బాధిత కుటుబానికి కాంగ్రెస్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అంతటి నర్సింహగౌడ్ మృతురాలి సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూ. 5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏనుగు రఘుమారెడ్డి, దేశబోయిన మల్లమ్మ, చీమల వీరేశం, మారగోని యాదయ్య, కాటం సత్తయ్య, మేడబోయిన సత్తయ్య, ముదుపు యాదిరెడ్డి, అంశల శ్రవణ్ కుమార్, మంకాల శ్రీను, గోలి గణేష్, నందిపాటి యాదయ్య, ఓర్సు భిక్షం, వరికుప్పల నర్సింహ, గోలి అరవింద్, అరూరి శివకుమార్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం తిరుమలరాయినిగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన బండారు యాదయ్య, బండారు సైదమ్మల కుటుంబాలకు అవనిజ ఫౌండేషన్ చైర్మన్ బట్ట సైదులు ఒక్కో కుటుంబానికి 50కిలోల బియ్యం అందజేసి, తన దాతృత్వం చాటుకున్నాడు.

పీహెచ్‌సీ నిర్మాణమెప్పుడో?

» నిధులు మంజూరైనా ప్రారంభంకాని పనులు » వైద్యం కోసం పక్క మండల కేంద్రాలకు వెళ్తున్న ప్రజలు » పట్టించుకోని అధికారులు


గట్టుప్పల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ ఏర్పాటుకు రెవిన్యూశాఖ కేటాయించిన స్థలం

గట్టుప్పల్, మే 4 (ఆంధ్రజ్యోతి): కొత్త మండలంగా ఏర్పడిన గట్టుప్పల్ మండలాన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా మారింది మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి. కొత్త మండలంలోని ప్రజలు వైద్య సదుపాయాలు కల్పించేందుకు మండల కేంద్రంలో పీహెచ్‌సీ నిర్మాణానికి గట్టుప్పల్ నుంచి వెల్మకన్నెకు వెళ్లే దారిలో ఒక ఎకరానికి పైగా స్థలాన్ని కేటాయించారు. అంతేకాక 15 ఫైనాన్స్ నిధుల నుంచి రూ. 1.43 కోట్లు నిధులు కూడా మంజూరయ్యాయి. కానీ ఆస్పత్రి నిర్మాణానికి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకలేదు. దీంతో మండలంలోని ప్రజలు ఆరోగ్యం కోసం చిన్నాచితక ఆర్ఎంపీలపై ఆధారపడటం లేదంటే పక్క మండల కేంద్రాలకు వెళ్తున్నారు. వైద్యానికి చండూరు, మర్రిగూడ, మునుగోడు వెళ్లాల్సిన పరిస్థితి.

తేరట్‌పల్లి, కమ్మగూడెం, శేరిగూడెం, గట్టుప్పల్ గ్రామాల ప్రజలు తమ పాత మండలమైన చండూరుకు వెళ్తుండగా నామాపురం,అంతంపేట గ్రామాల ప్రజలు మర్రిగూడెం మండలానికి వెల్మకన్నె గ్రామస్థులు పాత మండలమైన మునుగోడుకు వైద్యం కోసం వెళ్తున్నారు. అది కూడా సాధ్యం కానీ పేద ప్రజలు గ్రామాల్లో ఉన్న చిన్నాచితక ఆర్ఎంపీల వద్ద వైద్యం చేయించుకుని కాలాన్ని గడుపుతున్నారు.

గతేడాదే మంజూరైన నిధులు

గట్టుప్పల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి గత సంవత్సరం అక్టోబరులో 15 ఫైనాన్స్ నిధుల నుంచి 1.43 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అంతేకాక గట్టుప్పల్ నుంచి వెల్మకన్నె వెళ్లే దారిలో ఒకఎకరానికి పైగా స్థలాన్ని కూడా కేటాయించారు. నిధులు,భూమి ఉంది అంతేకాక ఆయా ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి నిర్మాణం మొదలు పెట్టాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. దీంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేసి వైద్య సేవలు అందించాలని మండలంలోని ఏడు గ్రామపంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే పీహెచ్‌సీ నిర్మాణ పనులు చేపట్టాలి


గట్టుప్పల్ మండల కేంద్రంలో ప్రకటించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి. మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉంది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా చిన్న మండలమైన గట్టుప్పల్‌లో పీహెచ్‌సీని నిర్మించి అన్ని వసతులను కల్పించాలి.

- కర్నాటి వెంకటేశం, మాజీ జడ్పీటీసీ

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం


గట్టుప్పల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. ఇటీవల కాలంలోనే టెండర్ల ప్రక్రియను పూర్తయింది. సాధ్యమైనంత త్వరలో మిగతా పనులు పూర్తి చేసుకుని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

- నాగేశ్వరరావు, డీఈ, పంచాయతీరాజ్ శాఖ

విద్యార్థుల్లో కల్మషం లేని ప్రేమ, ఆప్యాయత

● అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్

కట్టంగూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉండే విద్యార్థుల్లో ఉండే ప్రేమ, ఆప్యాయతలు కల్మశం లేనివని జిల్లా అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఈదులూ రు గ్రామంలో 1985-86 10వ తరగతి బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం నిర్వహించిన సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యా వ్యవస్థలను బలోపేతం చేయాల్సింది విద్యార్థులు, ఉపాధ్యాయులేనని న్నారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నైపుణ్యం గల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో ఉంటారని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1985-86 పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా ఇక్కడ కలవడం ఆనాటి విషయాలను గుర్తు చేసుకోవడం ఎంతో గొప్పవిషయమన్నారు. ఆ రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ప్రతిభను ప్రదర్శించి నేడు ఉన్నత స్థాయి ఉద్యోగాలను సంపాదించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అదనపు కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహ్మద్ అలీ, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దానయ్య, సత్యనారాయణ, అబ్దుల్ కరీం, మేకల పద్మ, కలమ్మ, జ్ఞానేశ్వరి, పార్వతమ్మ, వెంకట్, భువనేశ్వరి, శోభ, సాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఈదూలురులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్

నల్లగొండ టౌన్: పట్టణంలోని మమత హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన 2000 సంవత్సరపు పదవతరగతి పూర్వవిద్యార్థులంతా ఒక్క దగ్గరికి చేరి పాత జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యానాల ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, సలీం, వెంకన్నలతో పాటు పూర్వవిద్యార్థులు పబ్బు సందీప్‌రెడ్డి, మధు, నగేష్, మహేష్, తేజస్విని, దీపిక, విజేయందర్ తదితరులు పాల్గొన్నారు.


పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

రామలింగాలగూడెంలో
ఆదిమానవుని ఆనవాళ్లు

- 6 వేల సంవత్సరాల నాటి రాతికళ
- వెలుగు చూసిన కొత్త రాతియుగపు రాతికళ
- కాపాడుకోవాలంటున్న పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి


దేవుని గుట్టపై రాతియుగపు చిత్రకళ ఆనవాళ్లను చూపిస్తున్న పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

నల్లగొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): తిప్పర్తి మండలం రామలింగాలగూడెం దేవుని గుట్టపై రాతియుగపు చిత్రకళ ఆనవాళ్లు ఉన్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. శివాలయం పక్కనే ఉన్న దేవుని గుట్టను ఆదివారం ఆయన పరిశీలించి అక్కడి విశేషాలను విలేకరులకు తెలిపారు. మూడు బండలపైన కొత్త రాతియుగపు మానవులు, వారు నిత్యం వాడుకునే రాతి పరికరాలతో ఎద్దులు, దుప్పులు, జింకలు, కుక్కలు, పులి ఇంకా నాటి మానవులు వేటాడే దృశ్యాల బొమ్మల్ని తీర్చిదిద్దినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ రాతికళ క్రీస్తుపూర్వం 6000-4000 సంవత్సరాల మధ్య కాలానికి చెందినదని తెలిపారు. గుట్టపై సహజంగా ఏర్పడిన నీటి దోనెలు, రాతి గొడ్డళ్లను అరగ తీసుకున్న ఆనవాళ్లు కూడా ఉన్నాయన్నారు. గుట్టపై సహజంగా ఏర్పడిన పెద్దపెద్ద బండల మాటున గల గుహల్లోనూ, పాము పడగ ఆకారంలో గల రాతి చరియల కింద నివసిస్తూ, తీరిక సమయాల్లో తాము పాల్గొన్న సంఘటనలను, చూసిన దృశ్యాలను వారు చిత్రించారని శివనాగిరెడ్డి తెలిపారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ పురాతన రాతికళను కాపాడి, భవిష్యత్తు తరాలకు తెలియ చేయాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శిల్పి వెంకటేష్, మోతీలాల్ పాల్గొన్నారు.


టమాటా తోటపై వైట్ టార్పాలిన్ కప్పి ఉంచిన దృశ్యం

టమాటాకు వైట్ టార్పాలిన్ రక్ష

నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ధర్మాపురం గ్రామంలో పోయిన సంవత్సరం ఎండల వేడికి ఆకుముడత, తక్కువ దిగుబడి రావడంతో ఈ సంవత్సరం శ్రీనివాస్ రెడ్డి అనే రైతు తన ఐదు ఎకరాల పొలంలో టమాట సాగు చేస్తున్నాడు. అధిక దిగుబడి రావడం కోసం ఒక్కొక్క సాలుకు వైట్ తార్పాలను నిర్మించి అధిక దిగుబడిని ఆశిస్తున్నాడు. లాభాలు కూడా ఆశాజనకంగా ఉన్నాయని ఒక్కొక్క చెట్టుకు 8 నుండి 12 కిలలో టమాట కాస్తోందని రైతు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



ఎన్జీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి వస్తున్న కలెక్టర్ త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్



పరీక్షా కేంద్రం వద్ద తమ ఆభరణాలు తొలగిస్తున్న విద్యార్థులు



ప్రశాంతంగా నీట్

వైద్య, దంత వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్దేశించిన నీట్ - 2025(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) నల్లగొండ జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను తనిఖీ చేశారు. నీట్ పరీక్ష రాసే అభ్యర్థులను జిల్లా యంత్రాంగం క్షుణ్ణంగా తనిఖీ చేసింది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.




నల్లగొండలో విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపిస్తున్న సిబ్బంది

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.160	240	270
నల్లగొండ	రూ.162	235	267

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 24.8



పల్లెకు పోదాం సందడి చేద్దాం



- వేసవి సెలవులు.. పల్లెతల్లిపై ప్రేమానురాగాలకు నెలవులు
- కనువిందు చేసేలా పల్లె అందాలు
- యాంత్రిక జీవనం వీడి.. కొత్త ప్రపంచంలో విహారం

కోడి కూతలు.. కోడె లేగలు.. యాప పుల్లలు.. సాంపి చల్లడం.. ముగ్గేయడం పల్లెకు సొంతం. ఉదయాన్నే పాలపొంగు లాంటి పల్లెల్లో జోడెడ్లను తోలుకొని, నాగలి భుజాన పెట్టుకొని రైతన్న పయనమవు తుంటే, ఆ ఎడ్లకున్న గంటల శబ్దం, రాములోరి గుడిలోని గంటల శబ్దం ఒక్కటై మోగు తుంటే పల్లెలోని పరిమళత్వం మైమరిపిస్తుంది. పైరగాలి చల్లదనం, చెరువుల్లో చేప పిల్లల సవ్వడి, మామిడి తోటల సోయగం చూసేందుకు చూడ ముచ్చటగా కన్పిస్తాయి. మావ, బాపుల పలకరింపులు, బావ, మరదళ్ల ఆటలు, జిల్లగోనలు, గోలీలాటలతో చిన్నారుల సందడి ఏడాదికి ఒక్కసారైనా ఊరిని చూసొద్దాం రమ్మంటూ పిలుస్తాయి. ఉరుకుల, పరుగుల జీవనానికి అలవాటుపడిన ప్రజలు.. వేసవి సెలవుల్లో స్వగ్రామాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంటోంది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

7

నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం బొమ్మకల్ వద్ద ఇసుక కోసం పాలేరు వాగులో సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు



ఆంధ్రజ్యోతి పరిశీలన

జిల్లాలో ఇసుకమాఫియా చెలరేగిపోతోంది. మాఫియాను కట్టడి చేయాల్సిన అధికారయంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు లొంగడంతో ఇసుక అక్రమదందా మూడుపువ్వులు, ఆరుకాయలుగా కొనసాగుతోంది. పోలీస్‌యంత్రాంగం సైతం ఇసుక మాఫియాకు సహకరిస్తుండడంతో అక్రమరవాణాకు అడ్డుకట్టపడడం లేదని, దీంతో సామాన్యులకు ఇసుక అందుబాటులో లేకపోగా, జలవనరులు ధ్వంసమవుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

ఇసుక మాఫియా ఇష్టారాజ్యం!

- ఇద్దరి కీలకవ్యక్తుల కనుసన్నల్లోనే దందా
- వంగమర్తి ఇసుకే కాళేశ్వరం పేరుతో సరఫరా
- కంచె చేను మేస్తుండడంతో సహకరిస్తోన్న పోలీస్, రెవెన్యూ యంత్రాంగం
- కట్టడి చేయకపోతే ఆదాయం కోల్పోవడమే కాదు, వాగుల రూపమూ కోల్పోయే ప్రమాదం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారం మండలంలోని వంగమర్తి మొదలుకొని జిల్లాలోని మూసీ, పాలేరు నదుల నుంచి దాదాపు 40 ప్రాంతాలనుంచి ఎక్కడపడితే అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మొత్తంగా కీలకమైన ఈ ఇసుక రవాణా మొత్తం ఇద్దరు, ముగ్గురు కీలకవ్యక్తుల కనుసన్నల్లోనే కొనసాగుతుండడం, అధికారులను సైతం వారి కనుసైగలతో శాసిస్తుండడంతో దందాకు అడ్డుకట్టలేకుండా పోయింది.

కాళేశ్వరం, భద్రాచలం లారీల పేరున సరఫరా...

జిల్లాలో కీలకమైన వంగమర్తి రీచ్ నుంచి ఇసుకను రాత్రివేళల్లో, తెల్లవారుజామున అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్నారు. వైటీపీఎస్‌కు సైతం ఈ ఇసుకనే భద్రాచలం, కాళేశ్వరం లారీల పేరుతో సరఫరా చేస్తున్నారని, దీంతో స్థానికంగా తమకు ఉపాధి లేకుండా పోయిందని మిర్యాలగూడ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ నాయకులు నల్లగొండ జిల్లా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేకపోవడానికి రాజకీయ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. ఈ ఇసుకదందా నిర్వహిస్తోన్న కీలకవ్యక్తులే ఇందుకు కారణమని, ప్రధానంగా స్థానిక వాహనాలకు వైటీపీఎస్‌లోకి ఇసుక సరఫరాకు అనుమతిస్తే విషయం బయటకు పొక్కుతుందనే అభిప్రాయంతోనే బ్యాక్‌డోర్ సరఫరాకు తెరలేపారని ఆరోపణలు వస్తున్నాయి. ఆ పరిశ్రమలో నిర్మాణాలకు ఉపయోగించే ఇసుక, వాహనాలను తమ కనుసన్నల్లోనే కొనసాగాలనే పట్టుదలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో స్థానిక లారీలు, ఇసుక రవాణా వాహనాల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంలో వెళితేనే నాణ్యమైన ఇసుక...

జిల్లాలో అధికారికంగా 'మన ఇసుక - మన వాహనం' కింద 23చోట్ల ఇసుక తవ్వకాలకు అనుమతించారు. వంగమర్తి వద్ద 8 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు అవకాశముందని, అనుమతించాలని మైనింగ్‌శాఖకు అనుమతికోసం నివేదించారు. అయితే ఇక్కడ ఇప్పటికే మన ఇసుక- మనవాహనం కింద తవ్వకాలు కొనసాగుతున్నాయి. అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా అవి నామమాత్రంగా మిగలగా, రాత్రివేళ, తెల్లవారుజామున ఎక్స్‌కవేటర్ల ద్వారా తవ్వకాలు జరిపి లారీల్లో ఇసుకను డంప్ చేస్తున్నారని, రాత్రివేళ జరిగేదంతా అక్రమ మార్గాన్నే అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వంగమర్తితోపాటు, అమ్మనబోలు వద్ద సైతం ఇదే పరిస్థితి కొనసాగుతోంది. జిల్లాలో అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఇసుకను బుక్‌చేసుకోవాలంటే సర్వర్ సమస్యలు, తదితర సాంకేతిక కారణాలతో రెండు, మూడు రోజులపాటు ప్రయత్నిస్తే ఒకటో, రెండో ట్రాక్టర్ల ఇసుక బుక్ చేసుకోగలుగుతున్నామని....

- మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- సాగర్ పూడికతీతకు చర్యలు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మిర్యాలగూడ, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి, జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులు, పౌరసరఫరాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రూ.లక్షా21వేల కోట్లు ఖర్చు చేసి నామమాత్రంగా ఆయకట్టుకు సాగునీరు అందించిందని, తాము అధికారంలోకి వచ్చాక అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.23వేల కోట్లు ఇరిగేషన్‌కు కేటాయించామన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూడికతీత పనులు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు జాతీయస్థాయిలో చర్చించి ఒక్క ఎక్స్‌పోర్టు కమిటీ వేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం డిండి ప్రాజెక్టును చాలాకాలం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.1800కోట్లు కేటాయించి టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టినట్లు తెలిపారు. గంధమల్ల, ఉదయ సముద్రం ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి పనులు చేపట్టినట్లు చెప్పారు. కాళేశ్వరంపై పెట్టిన ఖర్చు అన్ని ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు సరిపోయేదన్నారు. ఈ ఎండాకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ చెరువులన్నింటికీ మరమ్మతులు చేపడుతామన్నారు. ఇరిగేషన్‌శాఖలో లష్కర్‌ల కొరత తీర్చేందుకు ప్రతీ సీఈ కింద 50 నుంచి 100 మంది లష్కర్‌లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై నియమించేందుకు కలెక్టర్‌లకు అధికారాలు ఇచ్చామన్నారు. మొత్తం 1800 పోస్టులను 33 జిల్లాలకు కేటాయించామన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్ఆర్, భూసేకరణ త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని ఆదేశించారు.

- మిగతా 6వ పేజీలో...

బ్రాహ్మణవెల్లెంల పూర్తి చేసింది మేమే

మంత్రి వెంకట్‌రెడ్డి



బ్రాహ్మణవెల్లెంల పూర్తి చేసింది మేమే అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ధర్మారెడ్డి, పిలాయిపల్లి, బ్రాహ్మణవెల్లెంలలో కాల్వలను సైతం పూర్తి చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును పూర్తిచేసినట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అత్యధికంగా రూ.1700 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రోడ్లపై రూ.150 కోట్లు ఖర్చుపెట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

వానాకాలంలో నీరందించాలి

శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి



ఎండాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాజెక్టుల కింద నిర్వహణ కోసం నిధులు కేటాయించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శివన్నగూడెం కింద కిష్టాపురం వరకు కాల్వలను పొడిగిస్తే ఆ చుట్టుపక్కల ప్రాంతానికి సాగునీరు అందుతుందన్నారు. ఎస్ఎల్‌బీసీ లైనింగ్ పనులకు రూ.442కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, రానున్న రోజుల్లో ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయితే ఉదయ సముద్రం కింద ఆయకట్టు పెరగనుందని, కాల్వ లైనింగ్‌తోపాటు వెడల్పు చేయాలని సూచించారు. పౌరసరఫరాలలో భాగంగా ఆంధ్రా నుంచి వస్తున్న ధాన్యాన్ని నియంత్రించాలన్నారు. ఖమ్మం నుంచి ధాన్యం ఎక్కువగా వస్తుందని, అక్కడి నుంచి ధాన్యం రాకుండా చూడాలని అధికారులను కోరారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నకిరేకల్, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే భూభారతి రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అధికారులకు సూచించారు. నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం రెవెన్యూ సదస్సులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 భూభారతి చట్టం అమలులో భాగంగా నకిరేకల్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతీ గ్రామంలో దండోరా వేయించాలని, రైతులు రెవెన్యూ సదస్సులో పాల్గొనే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- ఆర్టీసీ జేఏసీ నేతల డిమాండ్



డిపో గేటు ఎదుట సమ్మె పోస్టర్ ప్రదర్శిస్తూ ధర్నా చేస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

మిర్యాలగూడ టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం జేఏసీ ఆధ్వర్యంలో గేటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు పాండురంగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫేస్టోలో ప్రకటించిన విధంగా ఆర్టీసీని ఆదుకోవాలని, ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికులపై రోజురోజుకూ పనిభారం పెరుగుతోందని, డిపోలలో నియామకాలు చేపట్టడం లేదన్నారు. దీర్ఘకాలికంగా వేతన సవరణ జరగలేదని, సీసీఎస్ నిధులు చెల్లించలేదన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మె నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. అనంతరం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమాలలో రాష్ట్ర సీనియర్ నాయకులు ఏ. నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాము, ఎండీ. బేగ్, బీవై. కోటయ్య, వెంకన్న, రాయన్న, మధు, బాలునాయక్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ కమిటీ ఏర్పాటు

ఆర్టీసీ కార్మిక సంఘం జేఏసీ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఈయూ రాష్ట్ర కార్యదర్శి పాండురంగయ్య తెలిపారు. జేఏసీ చైర్మన్‌గా నరసింహ, వైస్‌చైర్మన్‌గా వెంకన్న, కన్వీనర్‌గా కోటయ్య, కోకన్వీనర్‌గా కేఎస్ రాయన్న, ఎమ్మారెడ్డి, శ్రీనివాస్, బేగ్, చంద్రశేఖర్ తదితరులతో జేఏసీ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

ప్రశాంతంగా నీట్ - 2025 ప్రవేశ పరీక్ష

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ



ఎన్జీ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండటౌన్, మే4 (ఆంధ్రజ్యోతి): వైద్య, దంత వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్దేశించిన నీట్ - 2025(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) నల్లగొండ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని 7 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షకు మొత్తం 2,082 మంది విద్యార్థులకు 2,006 మంది విద్యార్థులు హాజరుకాగా 81 మంది గైర్హాజయ్యారు. మొత్తం 96.1 శాతం హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను తనిఖీ చేశారు. నీట్ పరీక్ష రాసే అభ్యర్థులకు జిల్లా యంత్రాంగం మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద నుంచి పరీక్షా కేంద్రం వరకు వాహన సదుపాయం కల్పించింది. అదేవిధంగా కేంద్రీయ విద్యాయానికి వెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేశారు.

పట్టుదలకు మారుపేరు భగీరథుడు

అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాజ్ కుమార్



భగీరథ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్

నల్లగొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టుదలకు మారుపేరు భగీరథుడని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాజ్ కుమార్ అన్నారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని ఆదివారం కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన భగీరథ జయంతిలో పాల్గొని మాట్లాడారు. భగీరథ మహర్షి దివి నుంచి భువికి గంగను తీసుకొచ్చేందుకు కఠోర తపస్సు చేశారని, పట్టువదలని విక్రమార్కుడిలా గంగను తీసుకువచ్చి మానవాళికి నీటిని అందించాడని చెప్పారు. అందుకే సగర క్షత్రియ వంశీయులను పట్టుదలకు మారుపేరుగా చెప్తారన్నారు.

శ్రీరాముడి ఇక్ష్వాక వంశంలో భాగమైన సగర క్షత్రియులు దేశవ్యాప్తంగా నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారని, ప్రభుత్వం తరఫున వారికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మిషన్ భగీరథ తాగునీటి పథకానికి భగీరథుని పేరు పెట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సమాచార శాఖ సహాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భగీరథ మహర్షి మానవాళికి నీటిని అందించడమే కాకుండా పట్టుదలకు మారుపేరుగా నిలిచిపోయారన్నారు. జిల్లా సగర సంఘం అధ్యక్షుడు నేర్లకంటి రవి కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సహాయ అధికారి గామప్ప ఎస్తేర, జిల్లా సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లెట్ల మారయ్య, జిల్లా మాజీ అధ్యక్షుడు గంట కృష్ణ, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎన్.వసంత, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కర్నాకర్, సీనియర్ నాయకులు ఎన్.పెద్ద జంగయ్య, కోశాధికారి కొలుగూరి ప్రవీణ్, సీనియర్ నాయకులు ఎన్.సుధాకర్, పెండెం వెంకటేష్, గొల్లూరి యాదయ్య, యాదయ్య, శశిదర్, శ్రవణ్, సురేందర్, ధనలక్ష్మి, భిక్షమయ్య పాల్గొన్నారు.

దర్వేశిపురంలో భక్తుల సందడి



ఆలయం వద్ద భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

కనగల్, మే 4(ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్దనున్న రేణుకాఎల్లమ్మ క్షేత్రం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు నిర్వహించి, బోనం నైవేద్యం సమర్పించారు. ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టి అమ్మవారికి మొక్కుకున్నారు. ఉదయం అర్చకుడు నాగోజు మల్లాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయం వద్ద చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ప్రాజెక్టులకు మంచి రోజులు

- ఏఎమ్మార్పీ లైనింగ్, శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండిపై సీఎం ప్రత్యేక దృష్టి
- నిధులు కేటాయించిన కాంగ్రెస్ ప్రభుత్వం



6

భక్తజన సంద్రం.. యాదగిరిక్షేత్రం

- శాస్త్రోక్తంగా నిత్య పూజలు
- వారాంతంలో నేరుగా వస్తేనే ప్రోటోకాల్ దర్శనాలు



7

యువవికాసం @ 2136

● రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తుల వెల్లువ ● ఉమ్మడి మండలంలో 2136 దరఖాస్తులు

జూన్ 2న అందించనున్న మంజూరు పత్రం

పెద్దఅడిశర్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరిట కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. వివిధ స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించి ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు అందించనుంది. ఈ పథకానికి భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి గుడిపల్లి, పీఏపల్లి మండలంలోని 31 గ్రామ పంచాయతీలు ఉండగా 2136 దరఖాస్తులు అందాయి. అందులో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 485 మంది దరఖాస్తులు చేసుకోగా, ఎస్టీ కార్పొరేషన్ 708, బీసీ కార్పొరేషన్ 889, మైనార్టీ కార్పొరేషన్ 51 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.



పీఏపల్లి ఎంపీడీవో కార్యాలయం

స్టూడియో ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నా



అంగడిపేట ఎక్స్‌రోడ్డులో ఫొటో స్టూడియో కోసం రాజీవ్ యువవికాసంలో దరఖాస్తు చేసుకున్నాను. ప్రస్తుతం చిన్న పాటి ఫొటో స్టూడియో నడుపుతూ చిరు ఆదాయం పొందుతున్నాను. కానీ వచ్చే ఆదాయం ఎటూ సరిపోక వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇలా అనేక మంది నిరుద్యోగులు, యువత వివిధ యూనిట్ల కోసం రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా దరఖాస్తులు చేసుకున్నారు. రుణాలు మంజూరైతే ఉపాధి లభిస్తుంది.

- విజేందర్, అంగడిపేట ఎక్స్‌రోడ్డు

15వ తేదీలోపు పరిశీలిస్తాం



అభ్యర్థుల నుంచి రాజీవ్ యువవికాసం రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను మే 15వ తేదీ వరకు పరిశీలిస్తాం. అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తాం. అర్హులైన వారికి జూన్ 2వ తేదీన నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు మంజూరు పత్రాలు అందజేస్తాం.

- చంద్రమౌళి, ఎంపీడీవో

జూన్ 2న అర్హుల జాబితా

నిరుద్యోగులు, యువత రుణాలు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరిట రుణాలు అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో యూనిట్ల వారీగా జాబితాను విడుదల చేసింది. వీటి కోసం గత నెల 14వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయగా సంబంధిత దరఖాస్తుదారులు హార్డ్ కాపీలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు. వచ్చిన దరఖాస్తులను మే 1 నుంచి అధికారులు పరిశీలించనున్నారు. అనంతరం కలెక్టర్‌కు జాబితా అందజేస్తారు. అర్హులైన వారికి జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రుణ మంజూరు పత్రం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నిలువ నీడ కరువు

» గుర్రంపోడులో బస్టాండ్ లేక ప్రయాణికుల పాట్లు » రోడ్లపైనే వేచి చూడాల్సిన పరిస్థితి » పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి-గుర్రంపోడు)

గుర్రంపోడు మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నల్లగొండ-దేవరకొండ ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపైనే వీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని రోడ్డుపై గల గ్రామాల్లో గత ప్రభుత్వాల హయాంలో ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో బస్‌షెల్టర్లను నిర్మించారు. కానీ గుర్రంపోడు మండల కేంద్రంలో మాత్రం ఎలాంటి బస్ షెల్టర్ లేదు. మండల కేంద్రంలోని నడిబొడ్డున సుమారు రెండకరాల స్థలంలో శిథిలావస్థకు చేరిన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఉంది. 30 ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉంది. కానీ ఆ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరినప్పటికీ అక్కడ ఉన్న ఆక్రమణదారులు, కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఆచరణ సాధ్యం కావడం లేదు. మండల కేంద్రంలో వివిధ పనుల కోసం సుమారు వెయ్యి మంది వరకు ప్రతిరోజు ప్రయాణికులు వస్తూ పోతుంటారు. కనీసం వారికి మూత్రశాలలు కూడా లేక ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో రోడ్డుపై ప్రయాణికులు నిలబడి ఉండడంతో బస్సు బ్రేక్‌లు ఫెయిల్ అయి ముగ్గురు మృతి చెందిన సంఘటన జరిగింది. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటుకు ముందుకు సాగడం లేదు. రోడ్డుపై ఆక్రమణదారులు, రోడ్డుపక్కనే వీధి వ్యాపారులు ఉండడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీ అధికారులు, పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించడం లేదు. మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని పలువురు కోరుతున్నారు.



గుర్రంపోడులో బస్సుల కోస రోడ్డుపైనే నిలబడిన ప్రయాణికులు



రోడ్డు పక్కనే వీధి వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్

బస్టాండ్ నిర్మాణం చేపట్టాలి



మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం మూత్రవిసర్జన చేసేందుకు సులబ్ కాం ప్లెక్స్ కూడా నిర్మించాలి. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన మహిళలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. నిలువ నీడ లేక పోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే వేచిచూడాల్సిన పరిస్థితి ఉంది. మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు రోడ్డుపై కబ్జా చేసిన వారిని తొలగించి ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలి.

- మహ్మద్ షుకూర్, ప్రయాణికుడు

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

● మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, నాయకులు

చందంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. చందంపేట మండలం ముడుదండ్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠ, ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాసాని రాజవర్ధన్‌రెడ్డి, నాయకులు రమావత్ మోహన్‌కృష్ణ, దామెర శ్రీను, గోసుల శివశంకర్, తిరుపతయ్య, శ్రీశైలం, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి



కుర్మపల్లి జడ్పీహెచ్ఎస్‌లో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో

చింతపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలని మండల విద్యాధికారి ఎస్.అంజయ్య తెలిపారు. మండలంలోని కుర్మపల్లి జడ్పీ హైస్కూల్‌లో సమ్మర్ క్యాంపులో భాగంగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ యంగ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న వాలీబాల్, కబడ్డీ, కంప్యూటర్ శిక్షణ తదితర కార్యక్రమాలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అధ్యాపకులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు నాణ్యమైన విద్యనభ్యసించి జీవితంలో ఉపాధి రంగంలో రాణించినప్పుడే గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో చింతపల్లి ఎస్ఐ యాదయ్య, హెచ్ఎంలు పద్మాచారి, కృష్ణవేణి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పి.వాసుదేవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి దాతలు సహకరించాలి



చలివేంద్రం ప్రారంభిస్తున్న మిర్యాలగూడ మునిసిపల్ కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధికి దాతల సహకారం అవసరమని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. పట్టణంలోని తడకమళ్ల జంక్షన్‌లో ఎస్వీకే కన్‌స్ట్రక్షన్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంచేందుకు అందరి సహకారం అవసరమన్నారు. మొక్కల రక్షణకు అవసరమయ్యే ట్రీ గార్డులు, క్రీడా మైదానాలు, అంతర్గత కూడళ్లలో బెంచీలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధ అమలుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. అనంతరం చలివేంద్రం ఏర్పాటు చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, వెంకన్న పాల్గొన్నారు.

'ప్రత్యేక' పాలన అస్తవ్యస్తం

- గ్రామాల్లో పెరుగుతున్న సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- చేతులెత్తేసిన ప్రత్యేక అధికారులు

చింతపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం పూర్తయింది. దీంతో అధికారులు గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రవేశపెట్టారు. దీంతో గ్రామాల్లో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. చింతపల్లి మండలంలోని మొత్తం 34 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో పారిశుధ్య సమస్య రోజురోజుకు తీవ్రమవుతుంది. అంతేకాక వేసవికాలం కావడంతో ప్రజలకు తాగునీటి సరఫరా సక్రమంగా కాకపోవడంతో బిందెడు నీటి కోసం బండెడు కష్టాలు పడుతున్నారు. మండలంలో చేతిపంపులు 45 ఉన్నా ప్రస్తుతం 20 మాత్రమే పని చేస్తున్నా యి. మిగతావి 25 మరమ్మతుకు గురై అలంకారప్రాయంగా మారాయి.



వీటినగర్ కాల్వలో పేరుకుపోయిన మురుగునీరు

తాగునీటి కోసం తిప్పలు

తాగునీటి కోసం ప్రైవేట్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడాల్సిన వస్తుందని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. సర్పంచులు లేకపోవడంతో అధికారులు బాధ్యత తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

మండలంలో మొత్తం 34 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రధానంగా గొడుకొండ్ల, పోలేపల్లిరాంనగర్, ఎం.మల్లేపల్లి, పి.కే.మల్లేపల్లి, చింతపల్లి, వింజమూర్, నెల్వలపల్లి, కుర్మపల్లి, తదితర గ్రామాల్లో పూర్తి స్థాయిలో మురికి కాల్వలు ఏర్పాటు చేయలేదు. కాల్వల్లో మురుగునీరు పేరుకుపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గొడుకొండ్ల (వేంకటేశ్వరనగర్)లో సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారికి ఇరు వైపులా రెండు ప్రధాన మురుగు కాల్వలు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్లతో 1 కిలోమీటర్ల దూరంలో పనులు పూర్తి చేశారు. మిగతా రెండు కిలోమీటర్ల దూరంలో పనులు పూర్తి చేయకపోవడంతో మురుగు నీరు కాల్వల్లో పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు.



డంపింగ్ యార్డుగా మారిన సీసీ రోడ్డు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



గ్రామాల్లో వేసవికాలం కావడంతో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. తాగునీటి కోసం వాటర్ ప్లాంట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి. క్యాన్లలో నీటిని కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్ట పోతున్నారు. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

- బాదేపల్లి నిరంజన్‌గౌడ్, గొడుకొండ్ల

కాల్వల నిర్మాణాన్ని పూర్తిచేయాలి



వీటీనగర్‌లో రెండు ప్రధాన మురికి కాల్వల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రానున్న వర్షాకాలంలో మురికి నీరు, వర్షపు నీరు కలిసి వ్యాపార సముదాయాల్లోకి వచ్చే అవకాశం ఉంది. నిధులు మంజూరు చేసి పనులు సత్వరమే పూర్తి చేయాలి.

- కొండూరి శ్రీదేవి, మాజీ సర్పంచ్, గొడుకొండ్ల

సమస్యల పరిష్కారం కోసం కృషి



గ్రామాల్లో పారిశుధ్య సమస్యతో పాటు తాగునీటి సమస్య పరిష్కారం కోసం కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేస్తా. ప్రజలకు మౌలిక వసతి సౌకర్యాల కల్పన కోసం చర్యలు తీసుకుంటున్నాం. కాల్వల నిర్మాణానికి ప్రణాళిక తయారు చేసి నివేదిక పంపా.

- సుజాత, ఎంపీడీవో, చింతపల్లి

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

హాలియా, మే 4(ఆంధ్రజ్యోతి): అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు గణపతి పూజ, ఎదుర్కోళ్లు, మధ్యాహ్నం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని పురోహితులు శాస్త్రోక్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంగ వెంకటేశ్వర్లు, చిట్టిపోలు వెంకన్న, కంచోజు కృష్ణామాచారి, బ్రహ్మానందరెడ్డి, బత్తిని రాము, మేకల పరమేష్, పాతనబోయిన సురేష్, చెన్ను జానారెడ్డి, కట్ల అంజయ్య, చెన్నకేశవులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బీజేపీ మండల అధ్యక్షుడిగా రామాంజి

హాలియా, మే 4(ఆంధ్రజ్యోతి): అనుముల మండల బీజేపీ అధ్యక్షుడిగా అనుముల మండలం పేరూరు గ్రామానికి చెందిన వనం రామాంజిని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆదివారం నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా వనం రామాంజి మాట్లాడుతూ పలు సామాజిక సేవ చేయడం వల్ల ఈ పదవి దక్కిందని అన్నారు. తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): ఉచిత కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వివేకానంద కరాటే అకాడమీ చైర్మన్ మాస్టర్ చిలుకూరి రమేష్ బాబు కోరారు. ఎన్నెస్పీ క్యాంపులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులకు వేసవి సెలవులలో అమరవీరుల పార్కులో ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుడిపల్లి (పెద్దఅడిశర్లపల్లి), మే 4: మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 1983-84 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 31 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈ రోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి గురువులు బుచ్చిరెడ్డి, సముద్రాల మల్లికార్జున్, శీలం నారాయణరెడ్డి, నాళ్ల మల్లయ్య, ప్రస్తుత ఎంఈవో సముద్రాల శ్రీనయ్య, ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటయ్య, ఏకుల శ్రీనివాస్, వర్కాల దామోదర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పీఏపల్లి: అప్పటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాల అభివృద్ధికి నగదు అందజేత

మిర్యాలగూడ టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బకాల్‌వాడీ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 2022-23లో విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థులు కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు మిత్రులలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారికి సాయమందించాలని నిర్ణయించారు. పాఠశాల అభివృద్ధికి తక్షణసాయంగా రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకయ్య, అక్కిరెడ్డి, జగదీష్‌రెడ్డి, చంద్రయ్య, ఆంజనేయశర్మ, భవాని, శోభారాణి, సరస్వతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు